


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV
ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :95 గురువారం 26 ఫిబ్రవరి 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

## ఎప్స్టీన్‌ను కలవడం తప్పే

- రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే
- అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు
- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన




**న్యూయార్క్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. అమెరికా కోర్టు ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఎప్స్టీన్‌తో తనకున్న సంబంధాలపై స్పందించిన ఆయన.. తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు.

02

## ఉదయ్‌పూర్‌లో విరోష్ పెళ్లిసందడి

### హాజరవుతున్న అంబానీ కుటుంబం



**ఉదయ్‌పూర్,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న వివాహ వేడుకలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 26న జరగనున్న ఈ ప్రైవేట్ వెడ్డింగ్‌కు సంబంధించిన ప్రీవెడ్డింగ్ వేడుకలు ఇప్పటికే పీక్స్‌కు చేరుకున్నాయి. కేవలం 100 మంది అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్‌కు చేరుకోవడంతో జోరుగా చర్చ మొదలైంది.

02



02

జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలో

## 200 చెట్ల నరికివేత

### ప్రకృతి వనాలపై పగబట్టడం దుర్మార్గమైన చర్య అన్న కెటిఆర్

**హైదరాబాద్,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

కాంగ్రెస్ కబంద హస్తాల్లో చిక్కుకుని రెండేళ్లుగా విలవిలలాడుతున్న తెలంగాణలో మనషులనే కాదు.. చివరికి పచ్చని చెట్లను కూడా బతకనివ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రతి పల్లెలో పచ్చదనం ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కేసీఆర్ నిర్మించిన ప్లలె ప్రకృతి వనాలపై కూడా పగబట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.

## సింఎం రేవంత్‌తో అడోబ్ సిఇవో శంతన్ భేటీ

**హైదరాబాద్,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.



## సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

- తహసిల్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణం
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



మిగతా 2 లో

కేంద్రం చర్యను

## తప్పుపట్టిన ప్రియాంక

### యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్- అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు.

## ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం

### బిష్ణోయ్ లీగల్ టీమ్‌పై కాల్పులు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

దేశ రాజధానిలో మరోసారి గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం రేపాయి. తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ లీగల్ టీమ్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో చోటుచేసుకుంది. లారెన్స్ బిష్ణోయ్ తరపున కోర్టు కేసులను వాదించే న్యాయవాదుల బృందం వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా లీగల్ టీమ్ వాహనంపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ (అఅ÷ఎ) ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది గ్యాంగ్ వార్‌లో భాగమా లేక లాయర్లను భయపెట్టడానికి చేసిన ప్రయత్నమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కాగా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికే అనేక హై-ప్రొఫైల్ హత్యలు, బెదిరింపుల కేసుల్లో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని లీగల్ టీమ్‌పై దాడి జరగడం సంచలనంగా మారింది.

02

8వ తరగతి పాఠ్యాంశంలో

## 'న్యాయవవస్థలో అవినీతి'

- పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు
- వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.

ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు

## పూర్తి అండ

### ఇజ్రాయిల్ పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

మిగతా 2 లో

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లిన సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా బుధవారం ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని తానేనని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు. ఇజ్రాయెల్‌తో 140 కోట్ల భారతీయుల స్నేహం, గౌరవం, భాగస్వామ్యం ఉంది.




తన పాలనా ప్రయాణం యుగాలకు

## మలుపు

- గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి
- దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం
- సాదాసీదా స్తాయి నుంచి సుదృఢ అమెరికాను నిర్మించా
- పౌరుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ఇరాన్ అణు కార్యాక్రమాలతో అప్రమత్తంగా ఉన్నాం

### స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ సుధీర్ఘ ప్రసంగం



**వాషింగ్టన్,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# తన పాలనా ప్రయాణం యుగాలకు మలుపు

ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాల ను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో ఆమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టా÷-గ్గ÷ట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.

## ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు

# పూర్తి అండ

మొదటిపేజీ తరువాయి

ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా ఉన్నాం. ఉగ్రవాదంతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం. ఉగ్రవాదానికి భారత్ పూర్తి వ్యతిరేకం. శాంతిస్థాపన అనేది అంత సులువైన విషయం కాదు. ఉనికి కోసం యూదులు అనేక కష్టాలు పడ్డారు'..ఇజ్రాయెల్‌ను గుర్తించిన 1950లోనే నేనూ జన్మించా. ఇజ్రాయెల్‌తో భారత్‌కు చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ పౌరులను హమాస్ చంపడం దారుణం. ఇజ్రాయెల్ పౌరుల హత్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించం. పాలస్తీనా సమస్యలపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి వీడాలి. భారత్ ఎప్పుడూ చర్చలు, శాంతినే కోరుకుంటుంది' అని అన్నారు. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ పార్లమెంటులో ఘనస్వాగతం లభించింది. ఇజ్రాయెల్ పార్లమెంటు 'నెస్సెట్'ను ఉద్దేశించి మోదీ బుధవారంనాడు ప్రసంగించారు. పార్లమెంటు హాలులోకి మోదీ ప్రవేశించగానే సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో మోదీకి స్వాగతం పలికారు. 'మోదీ... మోదీ' నినాదాలు హోరెత్తించారు. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు వంటి అత్యంత కీలక మిత్రదేశాల అధినేతలకు మత్రమే దక్కే ఈ అరుదైన గౌరవం భారత ప్రధానికి దక్కడం విశేషం. నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా మాట్లాడుతూ, నెస్సెట్ స్పీకర్‌గా సభలో ప్రసంగించనున్న తొలి ప్రధానిని ఆహ్వానించే అవకాశం దొరకడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. 'థాంక్యూ ప్రైమ్ మినిస్టర్ మోదీ' అంటూ హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

మొదటిపేజీ తరువాయి

## ఎప్‌స్టీన్‌ను

# కలవడం తప్పే

లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ గేట్స్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మాయిలతో సంబంధాలున్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణలపైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్టు అంగీకరించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు. తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు గేట్స్. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టిచూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆయన ఆవేదన చెందారు. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్య నిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతి ఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది. ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం ఆందోళన వ్యక్తం చేశారని అందులో పేర్కొంది. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్ రాసిన కొన్ని ఇ-మెయిల్ డ్రాఫ్టులు వెలుగులోకి వచ్చాయి. అందులో బిల్ గేట్స్‌కు డ్రగ్స్ సరఫరా చేయడం సహా రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు ఏర్పాటు చేసేందుకు తాను సహకరించానని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను నాటి నుంచీ గేట్స్ ఖండిస్తూనే ఉన్నారు. తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఫొటోల్లో తన పక్కన ఉన్న మహిళలు ఎప్‌స్టీన్ సహాయకులు మాత్రమేనని.. కావాలనే వారి ముఖాలకు మాస్క్ వేశారన్నారు. అలాగే ఎప్‌స్టీన్ వేధింపులకు గురైన బాధితులతో తాను ఏనాడూ సమయం కేటాయించలేదని గేట్స్ చెప్పుకొచ్చారు.

## మీడియా అకాడమీ ఛైర్మన్‌గా

## శ్రీనివాసరెడ్డి పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):

తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కె. శ్రీనివాసరెడ్డి పదవీకాలం మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ 24తో ఆయన పదవీకాలం ముగిసింది. దీంతో కొత్తవారిని నియమిస్తారని అంతా అనుకున్నారు. కానీ ప్రభుత్వం తిరిగి శ్రీనివాసరెడ్డికే అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో మరో రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. తన పదవీకాలం పొడిగించినందుకు ఆయన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లను నియమించలేదు

### -లబ్ధిదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు వస్తున్న వార్తలలో ఎలాంటి నిజం లేదు

మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం, ఫిబ్రవరి 25:

మంథని మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లను నియమించలేదని లబ్ధిదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు వస్తున్న వార్తలలో ఎలాంటి నిజం లేదని ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు గుండా రాజు, తీగల సమ్మయ్య, పోలు శివ లు పేర్కొన్నారు. బుధవారం మంథని పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ కు మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మంథని మున్సిపాలిటీ పరిధిలో 13 వార్డులలో ఏ వార్డులో లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వినతి మేరకు 54 ఇండ్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించారని వారు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలని పూర్తి సహకారం అందిస్తామని, ఎవరైనా లబ్ధిదారులను బెదిరింపులు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. కొందరు తమ రాజకీయ లబ్ధి కోసమే అధికార కాంగ్రెస్ పార్టీని పార్టీ కార్యకర్తలను బదునం చేస్తున్నారని పోతరవేణి రాజయ్య, అట్టెం వినయ్, కొంతం శ్రీను,పర్శవేన మోహన్ యాదవ్, నాయని సంతు లు ఆరోపించారు.

మొదటిపేజీ తరువాయి

# ఉదయ్‌పూర్‌లో విరోష్ పెళ్లిసందడి

ఆయనతో పాటు నీతా అంబానీ, కోకిలాబెన్ అంబానీ, ఆకాశ్ అంబానీ, శ్లోకా అంబానీ కూడా వచ్చినట్లు ప్రచారం సాగింది. దీంతో అంబానీ కుటుంబం విరోష్ వెడ్డింగ్‌కు హాజరవుతున్నారన్న వార్తలు వైరల్ అయ్యాయి. అయితే తాజా సమాచారం ప్రకారం అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్ సందర్శనకు ఈ వివాహంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైంది. ఉదయ్‌పూర్ సమీపంలోని నాథ్‌ద్వారాలో ఉన్న శ్రీనాథ్ జీ ఆలయంలో దర్శనం కోసం అంబానీ కుటుంబ సభ్యులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆలయం వద్ద తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు వాటిని విరోష్ వెడ్డింగ్‌కి అటాచ్ చేశారు. అయితే ఇది కేవలం యాదృచ్ఛికమేనని, పెళ్లికి సంబంధం లేదని సమాచారం. ఈ సెలబ్రిటీ వివాహం పూర్తిగా ప్రైవేట్ వేడుకగా జరుగుతోంది. ఇప్పటికే ఉదయ్‌పూర్ విమానాశ్రయంలో కనిపించిన వారిలో దర్శకుడు తరుణ్ భాస్కర్, నటి ఈషా రెబ్బా, నటి ఆషికా రంగనాథ్, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తదితరులు ఉన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా హాజరయ్యే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది.వివాహ విందు పూర్తిగా దక్షిణాది శైలిలో ఉండబోతోందని సమాచారం. అతిథులకు అరిటాకుల్లో భోజనం వడ్డించనున్నారు. ప్రత్యేకంగా కొబ్బరి నీళ్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి సరదా క్రీడలతో సందడి చేశారు. ఫిబ్రవరి 26, 2026న ప్రధాన వివాహం జరగనుండగా, సినీ పరిశ్రమ స్నేహితుల కోసం మార్చి 4న ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మొత్తానికి, అంబానీలు ఉదయ్‌పూర్‌లో ఉన్నారన్న విషయం నిజమే అయినప్పటికీ, అది విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న పెళ్లితో సంబంధం లేదని సమాచారం.

మొదటిపేజీ తరువాయి

# సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## 8వ తరగతి పాఠ్యాంశంలో

# 'న్యాయవవస్థలో అవినీతి

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మొదటిపేజీ తరువాయి

# 200 చెట్ల నరికివేత

మహబూబ్ నగర్‌లోని దేవరకద్ర మండలం జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలోని 200 చెట్లను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే నిర్దాక్షిణ్యంగా నరికివేయడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. పదేళ్లపాటు ఆహ్లాద వాతావరణంలో కళకళలాడిన పల్లెలను అన్నిరకాలుగా ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నిజస్వరూపం రోజుకో రూపంలో బయటపడుతోందని తెలిపారు. ఇప్పటికే చెక్ డ్యామ్‌లను పేల్చివేస్తున్నారని.. చెరువులను చెరబట్టారని.. వ్యవసాయాన్ని కుప్పకూల్చారని.. కులవృత్తులను కాలరాశారని పేర్కొన్నారు. ఇప్పుడు నీడనిచ్చే చెట్లను కూడా అడ్డంగా నరికేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఈ దుశ్చర్యకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'పల్లె కన్నీరు పెడుతుందో' అని మరోసారి పాడుకునే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ పార్టీపై తెలంగాణలోని ప్రతి గ్రామం తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

మొదటిపేజీ తరువాయి

## కేంద్రం చర్యను

# తప్పుపట్టిన ప్రియాంక

ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెతారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతిఘటన మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది ' అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ÷ూగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

# ఇజ్రాయిల్ పర్యటనకు బయలుదేరిన ప్రధాని

### రెండ్రోజుల పాటు పర్యటించనున్న మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం ఇజ్రాయెల్‌కు బయల్దేరి వెళ్లారు. ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన సతీమణి సారా స్వాగతం పలుకనున్నారు. ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేందుకు యావత్ ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. ప్రధాని మోదీ రాకను ప్రకటిస్తూ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. మోదీని తన స్నేహితుడిగా అభివర్ణించారు. ఈ రెండు రోజుల్లో ప్రధాని మోదీ అనేక ముఖ్యమైన రక్షణ, వ్యూహాత్మక అంశాలపై చర్చిస్తారు. తన పర్యటనలో మొదటి రోజు(బుధవారం) మోదీ.. నెతన్యాహుతో ప్రైవేట్ విందులో పాల్గొంటారు. అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇరుదేశాల స్పెషల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌నకు మోదీ పర్యటన ముందడుగుగా నిలుస్తుందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.



## మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలిసి మున్సిపల్ కమిషనర్ కి

# మెమరాండం సమర్పించారు

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 25 (ప్రజావీక్షం న్యూస్ )

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణం లోని 30 వార్డుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటుతో పాటు మంచినీటి ఇంటర్ కనెక్షన్లు కల్పించాలని వైస్ చైర్మన్ డాక్టర్ అనిత, మాట్లాడుతూ, పట్టణంలోని అనేక కాలనీల్లో సరైన వీధి దీపాల లేకపోవడం వల్ల రాత్రివేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందువల్ల, 30 వార్డుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసి, అవసరమైన చోట్ల కొత్త నీటి పైపులు వేసి ఇంటర్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెమరాండం స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ తిరుపతి, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఈ చర్యలు దోహదపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు వాలీ బాయ్, వసీం అహ్మద్, నంది సాయి, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- బాల్య వివాహాలపై అవగాహన కై ప్రచార రథం ప్రారంభం.
- బాల్యావా వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత.
- చిన్నారుల బాల్యాన్ని పరిరక్షించుకుందాం



ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం న్యూస్)

బాల్య వివాహాలను చేసిన ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ షేర్ ఎన్జీవో మరియు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వరంగల్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార రథాన్ని వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, బాల్యం అమూల్యమైన దశ అని పేర్కొన్నారు. బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక-మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి సి పి రవి, ఏ. హెచ్. టి. యూ ఇన్స్ స్పెక్టర్ శ్యామ్ సుందర్, ఎస్.ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ సమీయుద్దీన్, షేర్ స్వచ్ఛంద సంస్థ జిల్లాల కో -ఆర్డినేటర్ శిరీష, జ్యానేశ్వరి, జమున, ప్రశాంతి, కల్పన, గాయత్రి, చామంతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ ఎస్సై సందీప్ కుమార్...

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 25 ( ప్రజా వీ క్షణం న్యూస్ )

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం లోని బుర్దగూడ గ్రామపంచాయతీలో నిర్వహించిన రోడ్డు భద్రత మహోత్సవాలో అవగాహన కార్యక్రమంలో రూరల్ ఎస్సై సందీప్ కుమార్ పాల్గొని రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు ప్రధానంగా హెల్మెట్ ధరించడం అదేవిధంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వదు అని, ముఖ్యంగా వాహనదారులకు తప్పకుండా లైసెన్సు ప్రతి ఒక్కరికి ఉండాలని, అలాగే త్రిబుల్ డ్రైవింగ్ చెయ్యొద్దని, మరియు పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మందు తాగి వాహనాలు నడిపితే చాలా ప్రమాదమని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు బృందం మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



# అరుదైన గౌరవం

### వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యకి అంతర్జాతీయ పార్లమెంటరీ బాధ్యత

### ఇండియాసౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలి గా ఎంపికైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం న్యూస్)



వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియాసౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలి గా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ని గౌరవనీయ లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ (కాన్ఫరెన్స్ అండ్ ప్రోటోకాల్ బ్రాంచ్) అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భారతదేశం సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా ఈ పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూప్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ఈ బాధ్యత తనకు అప్పగించినందుకు లోక్‌సభ స్పీకర్ కి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌సౌదీ అరేబియా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పార్లమెంటరీ స్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈ నామినేషన్ వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గానికి గర్వ కారణమని, అంతర్జాతీయ పార్లమెంటరీ వేదికపై తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకువస్తుందని ఎంపీ అభిప్రాయపడ్డారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి...

## జిల్లా ఎస్పీ నితికా పంత్.

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 25 ( ప్రజా వీ క్షణం న్యూస్)

కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం పరిధిలో ఇందాని, గణేష్ పూర్, సోనాపూర్, వాంకిడి, కమాన ఎక్స్ రోడ్ బ్లాక్ స్పాట్స్‌ను జిల్లా ఎస్పీ నితికా పంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల అధికారులు ఎన్ హెచ్ ఏ ఐ, పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ.రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలు మరింత అప్రమత్తంగా వాహనాలు నడిపేలా అవసరమైన ప్రాంతాల్లో స్పష్టమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, సోలార్ లైటింగ్స్ ఏర్పాటు చేయాలని, అలాగే ప్రమాదాలకు అవకాశం ఉన్న చోట్ల రోడ్ బంప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు భద్రత సూచికలకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ సూచనలు, రిఫ్లెక్టివ్ మార్కింగ్స్ వంటి అంశాలు సమర్థవంతంగా అమలు చేయడం వల్ల వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. రోడ్డు మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు, ప్రజల్లో అవగాహన పెంపొందించడమూ అంతే ముఖ్యమని, పోలీస్ శాఖ , సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి ప్రమాదాలను గణనీయంగా తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్, వాంకిడి సిఐ సత్యనారాయణ, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, వాంకిడి ఎస్ఐ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.





# ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేసిన యం పి కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారద

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం)

ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల సరఫరా, వైద్య సేవల పరిస్థితిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు.వరంగల్ జిల్లాకు త్వరలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్, విమానాశ్రయం వంటి మూడు ప్రధాన ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ఈ కారణంగా చికిత్స కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంటూ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి సౌకర్యాలను ఇప్పటినుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేసినట్లు ఎంపీ వెల్లడించారు.






అనంతరం ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బందితో ఎంపీ, కలెక్టర్ లు సమావేశమై ఆసుపత్రి నిర్వహణ, సౌకర్యాల లోటుపాట్లు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వైద్యుల ఖాళీల భర్తీ, మందుల కొరత, శానిటేషన్ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి అవసరమైన నిధులు, వసతులు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఈడాక్టర్ బి. సాంబశివరావు, ఆసుపత్రి సివిల్ సర్జన్స్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామచంద్ర, ఆర్ ఎం ఓ డాక్టర్ యుగేందర్ ఇతర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ టి సి బస్ లో గుడుంబా తరలింపు

### పోలీసుల అదుపులోకి మహిళ



ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం న్యూస్)

హన్మకొండ నుండి ఏటూర్ నాగారం ప్రయాణిస్తున్న సూపర్ లెగ్సరీ ఆర్ టి సి .బస్ లో అక్రమంగా గుడుంబా తరలిస్తున్న మహిళను గుడుంబా సంచిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన పసర స్థానిక బస్ స్టాండ్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పసర ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న ఓ మహిళను తనిఖీ చేయగా, ఆమె వద్ద నుంచి గుడుంబా సాచీలు స్వాధీనం చేసుకున్నారు.అక్రమంగా మద్యం రవాణా చేస్తున్నందుకు ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసిన గుడుంబాను పోలీస్ స్టేషన్‌కు తరలించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమ మద్యం తయారీ, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# శక్తి డెయిరీ లో భారీ పేలుడు

### ఓవెన్ చాంబర్ తెరవగానే బ్లాస్ట్.. ఇద్దరికి తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు



ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం న్యూస్)

రఘునాథపల్లి మండలం లోని గోవర్ధనగిరి గ్రామంలో నడుస్తున్న శక్తి డైరీలో భారీ పేలుడు సంభవించి నట్లు సమాచారం. బాదం మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్‌లో ఉన్న ఓవెన్ చాంబర్ పూర్తిగా చల్లారక ముందే తెరవడం తో ఒక్కసారిగా బ్లాస్ట్ జరిగినట్టు తెలిసింది. పేలుడు ధాటికి అక్కడ ఉన్న బాదం సీసాలు పగిలిపోయి గాజు ముక్కలు కార్మికుల శరీరాల్లోకి దిగాయి. ఈ ప్రమాదంలో వివేక్, రామ్ గోపాలవర్మకు తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. ఇతరులకు స్వల్ప గాయాలు అయ్యాయని సమాచారం.గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమలో భద్రతా నిబంధనలు పాటించారా లేదా అన్న కోణంలో విచారణ కొనసాగుతోంది.ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది.

### చెత్త తరలింపు వాహనాలు సమయానికి


# ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుకోవాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

- బాలసముద్రంలోని ట్రాన్స్ఫర్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం న్యూస్)**

చెత్త తరలింపు వాహనాలు నిర్దేశిత సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు సూచించారు. బుధవారం హన్మకొండలోని బాల సముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న ట్రాన్స్ఫర్ స్టేషన్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి వాహన మరమత్తుల తీరుతో పాటు తడి పొడి చెత్త సేకరణ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెహికల్ షెడ్ కు చేరే స్వచ్ఛ ఆటోలు వాహనాలు తడి పొడి చెత్తను వేరుగా తీసుకు వస్తున్నాయా? అని అడిగి తెలుసుకొని ఎన్ని వాహనాలు మరమ్మత్తులు చేపట్టుటకు షెడ్ లో ఉన్నాయన్న కమిషనర్ కాంపాక్టర్ ల స్థితిగతులను ఈఈ ను అడిగి తెలుసుకున్నారు. తడి పొడి చెత్త ను వేరుగా సేకరించాలని ఆయా చెత్త సేకరణ వాహనాలు ఏ ప్రాంతాల్లో సేకరణ జరుపుతున్నాయని, ఏ సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుతున్నాయని, చెత్త తరలింపు ట్రాక్టర్లు జే సి బి ల తో పాటు వివిధ శానిటేషన్ వాహనాల కదలికల గురించి ఏం హెచ్ ఓ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ లు మాధవి లత, మహేందర్, డి ఈ రాజ్ కుమార్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



### మత్తు పదార్థాల నియంత్రణకు

# పటిష్ట చర్యలు చేపట్టాలి

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై వివిధ శాఖల అధికారులు, యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం న్యూస్)**



గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కు సంబంధించిన వివిధ శాఖల అధికారులు, యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు వివిధ శాఖలు తీసుకుంటున్న చర్యల గురించి శాఖల వారీగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై వీలైనంత ఎక్కువగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు నిర్వహించే సమావేశాల్లోను మత్తు పదార్థాల వాటిల్లే అనర్థాలపై అవగాహన కల్పించాలని డీఈవో కు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో నెలలో ఒకరోజులో కొంత సమయాన్ని మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేవిధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. హాస్టల్స్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయించే వారి సమాచారాన్ని అందజేయాలని సూచించారు. వివిధ శాఖల సమన్వయంతో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, డీఈవో ఎల్. వి. గిరిరాజ్ గౌడ్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు నరసింహారావు, ప్రశాంత్ రెడ్డి, సతీష్ బాబు, ఎన్సీడీపీఓ డాక్టర్ శ్రీనివాస్, డీ డబ్ల్యు ఓ విశ్వజ, కేఎంసీ నుండి డాక్టర్ సంధ్య, డాక్టర్ అనిత రెడ్డి, ఎన్ఐ టీ , కేయూ, ఎస్సార్ యూనివర్సిటీలతో పాటు కిట్స్, వివిధ శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితురాలును అరెస్ట్ చేసిన హసన్ పర్తి పోలీసులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం న్యూస్)**

మంగళవారం 24.02.2026 రోజున సిద్దాపూర్ గ్రామంలో బాల్నే మొగిలి తన ఇంటి వెనకాల మరణించి ఉన్నాడని తన కొడుకు బాల్నే రాజకుమార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హసన్ పర్తి ఇన్స్పెక్టర్ వట్టే చేరాలు దర్యాప్తు నిర్వహించి, బుధవారం నిందితురాలు వంగ ఇందిర తండ్రి: లేట్ నారాయణ, వయస్సు: 48, కులము: గౌడ ను నమ్మధగిన సమాచారం మేరకు వంగపహాడ్ గ్రామ శివారులో ఓ ఆర్ ఆర్ దగ్గర అరెస్టు చేసి విచారించి ఆమె హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. వివరాల్లోకి వెళ్ళినట్లయితే వంగ ఇందిర కు గత 30 సశీ.రాల క్రితం వివాహం జరిగి విడాకులు జరిగినవి. అప్పుడు తన భర్త తరపు వారు విడాకులు సమయంలో తిరిగి ఇచ్చిన డబ్బులు సుమారు 60,000 వేల రూపాయలు తన బావ అయిన బాల్నే మొగిలి తన వద్ద ఉంచుకొని అప్పటినుంచి వాటిని ఇస్తా అనుకుంటూ ఇవ్వకుండా వాడుకున్నాడు. అదే క్రమంలో తన అక్క అయిన బాల్నే సరోజిన గత మూడు నెలల క్రితం మరణించగా తన బావ అయిన బాల్నే మొగిలి సొంత గ్రామమైన సిద్ధాపూర్ కు వచ్చి ఒకటే ఇంట్లో ఇద్దరు ఉంటుండగా ఈ డబ్బుల విషయం అడగగా తనను తిట్టుతూ ఇంట్లో నుండి వెళ్లిపోవాలని చాలాసార్లు గొడవ చేయగా బాల్నే ఇందిరా ఎలాగైనా తన బావ బాల్నే మొగిలిని చంపాలని పథకం ప్రకారం మంగళవారం ఉదయం సుమారు 6 నుండి 7 గంటల మధ్యలో బాల్నే మొగిలి లేచి కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో ఇంటి వెనకాల మొగిలిని వెనక నుండి నెట్టివేసి కింద పడవేసి రాయితో, కత్తి, కర్రతో, విచక్షణారహితంగా ముఖం పైన దాడి చేసి బాల్నే మొగిలి చనిపోయినాడని నిర్ధారించుకొని ఇంట్లో నుండి వెళ్ళిపోగా బుధవారం హసన్ పర్తి పోలీసులు అరెస్టు చేశారు.

# బీహార్‌లో ఓ పెళ్లి వేడుకలో విషాదం

### వధువుపై తుపాకీతో

### కాల్పులు జరిగిన దుండగుడు

### ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వధువు

**పాట్నా,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

బీహార్‌లోని బక్సర్‌లో మంగళవారం రాత్రి జరిగిన వివాహ వేడుకలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఆ పెళ్లికి వచ్చిన వధువు ప్రియుడు ఘోరానికి పాల్పడ్డాడు. అందరూ చూస్తుండగానే వధువుపై కాల్పులు జరిపాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బక్సర్‌కు చెందిన పద్దెనిమిదేళ్ల ఆ కుమారికి మంగళవారం వివాహం జరుగుతోంది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఆర్తి తనకు కాబోయే భర్తతో వేదికపై ఉంది. ఆ జంట చుట్టూ స్నేహితులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. వధువు ఆర్తి సోదరి, నవదంపతులకు సిందూరం పెడుతున్న సమయంలో ఈ షాకింగ్ ఘటన జరిగింది. వేదిక ముందు గుమిగూడిన అతిథులలో ఒక వ్యక్తి ఆర్తిపై కాల్పులు జరిపాడు. బుల్లెట్ ఆర్తి కడుపులోకి దూసుకెళ్లింది. వెంటనే ఆమె కుప్పకూలిపోయింది. దీంతో వివాహ వేదిక వద్ద గందరగోళం నెలకొంది. మండపంలో కాల్పులు జరుగుతున్నాయనుకుని చాలా మంది కల్యాణ మండపం నుంచి బయటకు పరుగులు తీశారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆర్తిని సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికత్స అనంతరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతానికి ఆమె పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని సమాచారం. నిందితుడిని అదే గ్రామానికి చెందిన దీనబంధుగా గుర్తించారు. ఆర్తి, దీనబంధు మధ్య గతంలో ప్రేమ వ్యవహారం సాగిందని తెలుస్తోంది. కాగా, ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు అతని తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

# పాక్‌లో ఆకాశాన్నంటిన పళ్ల ధరలు


### అరటిపళ్లు కిలో 300 పైమాటే

**లాహోర్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

పాకిస్థాన్ చాలా ఏళ్లుగా తీవ్ర ద్రవ్యోల్బణంతో సతమతమవుతోంది. ఆ దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు తార స్థాయికి చేరాయి. ముఖ్యంగా పళ్ల ధరలు భారీగా ఉన్నాయి. రంజాన్ వేళ పళ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. పాకిస్థాన్‌లోని పండ్ల మార్కెట్‌కు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక వ్లాగర్ పండ్ల మార్కెట్లోని ధరలను వెల్లడించాడు. భారతీయ వ్లాగర్ రిజ్వాన్ ఒక దుకాణదారుడిని పండ్ల ధర గురించి అడిగాడు. ముందుగా పాక్‌లో కిలో అరటిపళ్లు 300 నుంచి 400 పాక్ రూపాయల వరకు ఉన్నట్టు దుకాణదారుడు చెప్పాడు. అలాగే ఒక కిలో బొప్పాయి 400 పాకిస్థానీ రూపాయలని చెప్పడంతో వ్లాగర్ ఆశ్చర్యపోయాడు. ఇక, ఆపిల్స్, ఖర్జూరాల ధరలైతే మరింత భారీగా ఉన్నాయి. ఆపిల్స్ కిలోకు 500 రూపాయలు అని చెప్పాడు. ఖర్జూరాల ధర గురించి అడిగినప్పుడు, కిలోకు 1,200 పాకిస్తానీ రూపాయలు అని చెప్పి షాకిచ్చాడు పైన పేర్కొన్నవే కాదు.. చాలా పళ్లు కిలో లెక్కన కొనాలంటే కనీసం 300 పాక్ రూపాయలు చెల్లించాల్సిందే. భారత్‌లోని ధరలతో పోల్చుకుంటే పాక్‌లోని పళ్ల ధరలు ఎన్నో రెట్లు ఎక్కువ. ద్రవ్యోల్బణం పాక్‌లోని సాధారణ ప్రజలకు ఒక ప్రధాన సమస్యగా మారిపోయింది. పళ్లు మాత్రమే కాకుండా, పెట్రోల్, గ్యాస్ వంటి వాటి ధరలు కూడా భారీగా ఉన్నాయి. రోజువారీ జీవితం గడపడం సామాన్యులకు కష్టంగా మారిపోయింది.

# నిట్ వరంగల్ లో మొదలైన స్ప్రింగ్ స్ప్రీ 2026 సాంస్కృతిక వేడుకలు




**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 25 (ప్రజా వీక్షణం న్యూస్)**




నిట్ వరంగల్ విద్యార్థుల సృజనాత్మక ఆత్మస్ఫూర్తి మరియు సాంస్కృతిక ఉత్సాహానికి ప్రతీక అయిన స్ప్రింగ్‌స్ప్రీ 2026 సాంస్కృతిక వేడుకలు తొలి ‘కర్టెన్ రైజర్’ కార్యక్రమం విశేష ఆకర్షణగా మొదలయ్యాయి. 40 అడుగుల ఎత్తైన ఉత్సవ బ్యానర్‌ను అధికారికంగా ఆవిష్కరించగా, ఐదు నిమిషాల పాటు సాగిన అద్భుతమైన బాణసంచా ప్రదర్శన క్యాంపస్ లో ప్రతి ఒక్కరి మొహాల్లో వెలుగులు విరజమ్మాయి. అనంతరం నిర్వహించిన ‘ఎథ్నిక్ నైట్’ సాంస్కృతిక మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి మాట్లాడుతూ,“స్ప్రింగ్‌స్ప్రీ మా విద్యార్థుల సృజనాత్మక ఆత్మస్ఫూర్తి మరియు సాంస్కృతిక ఉత్సాహానికి ప్రతీక. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు; ప్రతిభ, జట్టు భావం, నాయకత్వానికి వేడుక. నిర్వహణ బృందానికి నా శుభాకాంక్షలు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులంతా ఒక్క నిట్ వరంగల్ కుటుంబంగా కలిసి ఈ పండుగను జరుపుకోవాలని ఆహ్వానిస్తున్నాను” అన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, స్ప్రింగ్‌స్ప్రీ 2026కు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సహా వేలాది మంది అంతర్గత భాగస్వాములు పాల్గొంటున్నట్లు స్టేడియం, ఆడిటోరియం, ఎస్ఏసీ, ఏఎల్‌సీ మరియు అకడమిక్ భవనాల్లో ఒకేసారి అ ఉత్సవం సురక్షితంగా, సాఫీగా జరిగేందుకు పూర్తి సంస్థాగత సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎస్ఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ పి. హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఈ అద్భుతమైన వేడుకకు మద్దతు ఇచ్చిన ఎస్‌బీఐ, అజారా హాస్పిటల్, మింత్రా, చాయ్ షాట్స్ తదితర స్పాన్సర్లకు మా కృతజ్ఞతలు” తెలిపారు. ఈ ఉత్సవం సమగ్ర విద్యార్థి అభివృద్ధికి సంస్థ ఇచ్చే ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. సమన్విత్ రెడ్డి, మహాదేవ్ మాట్లాడుతూ: “స్ప్రింగ్‌స్ప్రీ క్యాంపస్ లో ప్రతి ఒక్కరి కోసం. సంగీతం, కళ, ఫోటోగ్రఫీ, సాహిత్యం లేదా పోటీలు ప్రతి విద్యార్థికి తన వేదిక ఇక్కడ లభిస్తుందని స్వర్ణోత్సవానికి భారీ స్థాయి స్టేజ్ ఏర్పాట్లు, ప్రొఫెషనల్ సౌండ్ & లైటింగ్ సిస్టమ్స్, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు మరియు క్యాంపస్ అంతటా సమన్వయ ఏర్పాట్లతో స్ప్రింగ్‌స్ప్రీ 2026 నిట్ వరంగల్ లో ఒక మైలురాయి సాంస్కృతిక వేడుకగా నిలిచిపోనున్నట్లు తెలిపారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, “స్ప్రింగ్‌స్ప్రీ 2026కు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సహా వేలాది మంది అంతర్గత భాగస్వాములు పాల్గొన నున్నారు. స్టేడియం, ఆడిటోరియం, ఎస్ఏసీ, ఏఎల్‌సీ మరియు అకడమిక్ భవనాల్లో ఒకేసారి అనేక కార్యక్రమాలు జరుగుతాయి” అని తెలిపారు.

# చెరువులు,ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత తహసీల్దార్లదే

**తెలంగాణ ఫిబ్రవరి 25 ప్రజా వీక్షణం**

జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టీకరణమార్చిలోగా ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.గ్రామ స్థాయిలోనే రెవిన్యూ సమస్యల పరిష్కారం కావాలి.గురువారం నుండి ‘గ్రామ రెవిన్యూ క్లినిక్’ల నిర్వహణకు ఆదేశం.పార్వతీపురం, ప్రజా వీక్షణం దినపత్రిక ఫిబ్రవరి 25 : జిల్లాలోని ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడాల్సిన ప్రాథమిక బాధ్యత తహసీల్దార్లదేనని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం రెవిన్యూ అధికారులకు ఉండే సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ప్రతీ సమస్యను సావధానంగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురైతే, చూస్తూ ఊరుకోకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. తహసీల్దార్లు అంటే మండల మేజిస్ట్రేట్ లు అన్న సంగతిని గుర్తెరగాలని అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రెవిన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్. దిలీప్ చక్రవర్తి తదితరులు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆక్రమణదారులపై అతిక్రమణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, వారి నుంచి ప్రభుత్వ భూములను రక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చి నెల ముగిసేలోగా ప్రతి మండలం నుంచి కనీసం ఒక ఆక్రమణ కేసునైనా నమోదు చేయాలని లక్ష్యాన్ని విధించారు. తహసీల్దార్లు =ూ=, అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే మీ అధికారాల గురించి మీకు స్పష్టత వస్తుందన్నారు. ఆక్రమణలు జరిగినట్లు రుజువైతే పోలీసుల సహకారంతో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. ప్రజలు రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామం దాటి మండలానికి, జిల్లా కేంద్రానికి రాకూడదని కలెక్టర్ హితవు పలికారు.

# 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసు

## శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అరెస్ట్

**కొలంబో,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసులో శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున రాజధాని శివారులో రిటైర్డ్ మేజర్ జనరల్ సురేష్ సల్లేను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్టర్ ఆదివారం పేలుళ్లకు కుట్ర పన్నడం, సహాయం చేయడం మరియు ప్రోత్సహించినందుకు ఆయనను అరెస్ట్ చేశారని అన్నారు. గోటబయ రాజపక్స అధ్యక్షుడైన తర్వాత 2019లో స్టేట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎస్ఐఎస్) చీఫ్‌గా సురేష్ పదోన్నతి పొందారని, ఆత్మాహుతి బాంబుదాడులకు సహకారం అందించారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. సురేష్ ఇస్లామిక్ బాంబర్లతో సంబంధం కలిగి ఉన్నాడని, దాడికి ముందు వారిని కలిశారని బ్రిటన్ మీడియా 2023లో వెల్లడించింది. ఆ ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికలను రాజపక్సకు అనుకూలంగా ప్రభావితం చేసేందుకు ఈ దాడిని కొనసాగించేందుకు ఆయన అనుమతించాడని ప్రజావేగు ఒకరు మీడియాకు తెలిపారు. 2019లో ఈస్టర్ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా జరిగిన బాంబు పేలుళ్లలో 45మంది విదేశీయులు మరణించగా, 500మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

# మోడీకి ఇజ్రాయిల్ గుజరాత్ లాంటిదే

## సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

ప్రధాని నరేంద్ర మోడీకి ఇజ్రాయిల్ రెండో గుజరాత్ లాంటిదని సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శించారు. ప్రధాని మోడీ రెండురోజులపాటు ఇజ్రాయిల్ పర్యటన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గాజాలో మారణహోమం సృష్టించి వేలాది మంది పాలస్తీనియన్ల ప్రాణాలను బలితీస్తున్న ఇజ్రాయిల్‌ను మోడీ సందర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెతుతున్నాయి. తాజాగా మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇజ్రాయిల్‌ను సందర్శించడం ప్రధాని మోడీకి ఒక హాబీగా మారింది. ఇజ్రాయిల్ ఆయనకు రెండవ గుజరాత్. ఇజ్రాయిల్ మానవాళి ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే దేశం. గాజాను లక్ష్యంగా చేసుకుని అమాయక ప్రజలను చంపుతోంది. మీకు తెలుసా..మోడీకి ఇజ్రాయిల్‌ని సందర్శించడం గుజరాత్‌ను సందర్శించడం లాంటిది' అని సందోష్ కుమార్ అన్నారు.

# బ్యాంక్‌లకు ఎగవేత కేసు

## అనిల్ అంబానీ నివాసం జప్తు


**ముంబై,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ముంబైలోని ఆయన విలాసవంతమైన నివాసం 'అబోడ్' ను తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ ఆస్తి విలువ రూ.3,716.83 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పాలిహిల్ ప్రాంతంలో ఉన్న ఈ భవనం 66 మీటర్ల ఎత్తు, 17 అంతస్తులతో లగ్జరీ టవర్‌గా పేరుంది. అంబానీ గ్రూప్ సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ కోట్లాది రూపాయల మేర బ్యాంకు రుణాల మోసానికి పాల్పడిన కేసులో ఈ జప్తు జరిగింది. దీంతో ఈ కేసులో ఇంతవరకూ జప్తు చేసిన అనిల్ అంబానీ ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది.ర్‌సీఓఎం మోసపూరిత బ్యాంకింగ్ డీలింగ్స్‌తో ఈ తాజా ప్రాపర్టీకి సంబంధం ఉందని ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. పీఎంఎల్‌ఏ కింద 2025 ఆగస్టులో అంబానీ స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డు చేసింది. త్వరలోనే మరోసారి ఆయనను ఈడీ ప్రశ్నించనుంది. అనిల్ అంబానీ ఆర్‌సీఓఎంపై తొలుత సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో దీనిపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. గత జూలైలో 35కు పైగా ప్రదేశాల్లో సోదాలు నిర్వహించింది. గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 25 మందికి పైగా వ్యక్తులను ప్రశ్నించింది.

# యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## రామావతారంలో హనుమంత వాహన సేవలో నారసింహుడు

**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై యాదగిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి వారు ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నయన మనోహరంగా స్వామివారు అలంకార సేవపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. లోక కల్యాణం కోసం స్వామివారు వివిధ అవతారాలు ఎత్తారని ఈ సందర్భంగా అర్చకులు ఉపదేశించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద మంత్రలు, వేదపారాయణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు సేవ పై ఊరేగారు. రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తర మాడవీధుల్లో ప్రత్యేకమైన కల్యాణ వేదికను సిద్ధం చేశారు. వీవీఐపీ, వీఐపీ, ఇతర భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండపైన పలు ప్రాంతాల్లో ఎల్ ఈ డీ స్క్రీన్లను ఉంచారు. ఈ సేవలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ భవానీ శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, ఆలయ అధికారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ డైరెక్టర్ కక్కుర్తి

- ప్రయాగ్ రాజ్ పర్యటనలో వ్యక్తిగత పనులకు సిబ్బంది
- ఏర్పాట్లకు పురమాయించడంతో వైరల్
- షోకాజ్ నోటీస్ జారీచేసిన కేంద్రం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ వివేక్ బంజల్ వివాదంలో చిక్కుకున్నారు. యూపీలోని ప్రయాగ్‌రాజ్ పర్యటనకు వెళ్లేందుకు ఆయన విస్తృత ఏర్పాట్లు చేసుకోవడం, ఇందుకు సంబంధించిన ఆయన చేసిన డిమాండ్లు వైరల్ కావడంతో కేంద్రం సీరియస్ అయింది. ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ వ్యవహారం తమకు దిగ్భ్రాంతి కలిగించిందని, ఇదెంతమాత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. అధికారి వివరణ తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం వివేక్ బంజాల్ ఈనెల 25-26 తేదీల్లో ప్రయాగ్‌రాజ్ పర్యటనకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయన పర్యటనకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ మేనేజర్ స్థాయి కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. సుమారు 50 మంది బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని కేటాయించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. సిబ్బందికి 20 పనులు కూడా కేటాయించారు. ప్రయాగ్‌రాజ్‌లో అడుగుపెట్టగానే సంగమంలో స్నానం, పడవపై విహారం, హనుమాన్ మందిరం, అక్షయ్ వాత్, పాటల్పురి ఆలయాల దర్శనం చేయించడం వంటి పనులు సిబ్బంది చూసుకోవాల్సి ఉంటుంది. తువాలు, అండర్ గార్మెంట్స్, చెప్పులు, దువ్వెన, అద్దం, షాంపూ, ఆయిల్ బాటిల్, ఘాట్ వద్ద వినియోగానికి ఒక బెడ్‌షీటు వంటివి అందుబాటులో ఉంచాలి. హోటల్, సర్క్యూట్ హౌస్ వంటి సదుపాయాలు కల్పించాలి. బంజల్ పర్యటనకు సంబంధించిన ఆదేశాలు ఆన్‌లైన్‌లో వెలుగుచూడటంతో ఈ వ్యవహారం సంచలనమైంది. కేంద్ర వెంటనే చర్యలకు దిగడం, షోకాజ్ నోటీస్ జారీచేయడంలో బంజల్ పర్యటన రద్దయింది. అయితే, అధికారిక పర్యటనలో ఇచ్చే స్థాయి ఉత్తర్వులనే తాము ఇచ్చినట్టు బీఎస్ఎన్ఎల్ ఇండియా వర్గాలు చెబుతున్నాయి.బంజల్ 1987 బ్యాచ్ ఇండియన్ టెలికమ్యూనికేషన్ సర్వీస్ అధికారి. ఎలక్ట్రానిక్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ డిగ్రీ, కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ డిగ్రీ చేసారు. ఎంబీఏ కూడా చదివారు. ఇండియాలో టెలికామ్ నెట్‌వర్క్ నిర్వహణలో 34 ఏళ్ల అనుభవం ఉంది.

# అన్నాడిఎంకెతో సీట్ల పంపకాలు

## నేడు చెన్నైలో పళనిస్వామితో బిజెపి నేతల చర్చలు

**చెన్నై,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అన్నాడీఎంకేతో సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలకు బీజేపీ సమాయత్తమవుతోంది. ఇరు పార్టీల మధ్య గురువారంనాడు చర్చలు జరుగనున్నాయి. ఈ చర్చలకు బీజేపీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సారథ్యం వహించనుండగా, అన్నాడీఎంకే నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళని స్వామి, సీనియర్ నేతలు పాల్గోనున్నారు. కాగా, 2024 ఎన్నికల్లో తమ పార్టీ సాధించిన 11 శాతం ఓట్ షేర్ ఆధారంగా బీజేపీ బేరసారాలు జరుపనున్నట్టు తెలుస్తోంది. 50 సీట్లను బీజేపీ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్డీయే కూటమిలో బీజేపీతో పాటు టీటీవీ దినకరన్ 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే), మరో రెండు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన దినకరన్ 2018లో ఏఎంఎంకే పార్టీని స్థాపించారు. ఎన్డీయేలోకి తిరిగి రావడానికి బీజేపీనే కారణమని, ఆ పార్టీతోటే తాను సీట్ల సంప్రందింపులు సాగిస్తానని దినకరన్ స్పష్టం చేశారు. సీట్ల పంపకాలపై బీజేపీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ, బీజేపీకి 35 సీట్లు, ఏఎంఎంకే వంటి ఇతరులకు 15 సీట్లను పార్టీ కేంద్ర నాయకత్వం కోరనుందని చెప్పారు. 2024లో పార్టీ పనితీరు ఆధారంగానే 2026 ఎన్నికల్లో సీట్ల పంపకాలు ఉండాలంటూ అన్నాడీఎంకే నాయకత్వానికి తెలియజేశామని, 2021లో ఇచ్చినట్టుగా 20 సీట్లు ఇస్తామంటే తాము అంగీకరించేది లేదని చెప్పారు. ఏఎంఎంకే 8 నుంచి 10 సీట్లలో పోటీ చేయాలనుకుంటోందని, ఏసీ షణ్ముగం 'న్యూ జస్టిస్ పార్టీ', జాన్ పాండియన్ 'తమిళగ మక్కల్ మున్నేట్ర గళం' చెరో రెండు సీట్లు ఆశిస్తున్నాయని, తక్కిన సీట్లు ఇతర పార్టీలకు బీజేపీ కేటాయిస్తుందని చెప్పారు. కాగా, 30 సీట్లకు తాము తగ్గేది లేదని, ఏఎంఎంకే 8 సీట్లయినా కావాలని గట్టిగా చెబుతోందని, దీంతో ఎన్డీయే బ్లాక్‌కు 40-50 సీట్లు కోరనున్నామని బీజేపీకి చెందిన మరో నేత తెలిపారు. కాగా, అన్నాడీఎంకే సొంతంగా 170 సీట్లలో పోటీ చేసేందుకు పట్టుదలగా ఉంది. బీజేపీకి 25, ఎన్డీయే బ్లాక్‌కు మరో 10 సీట్లు కేటాయించగలమని చెబుతోంది. పీఎంకేకు 17 నుంచి సీట్లు, ఒక రాజ్యసభ సీటు ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. బీజేపీకి 50 సీట్లు ఇవ్వడం చాలా కష్టమని, అయితే సంప్రదింపుల్లో ఆమోదయోగ్యమైన పరిష్కారం కుదురుతుందని ఆశిస్తున్నామని అన్నాడీఎంకే సీనియర్ నేత ఒకరు తెలిపారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్-మేలో జరుగనున్నాయి.

# విరోష్ జంటకు ప్రధాని శుభాకాంక్షలు

## విషెష్ చెబుతూ మోడీ లేఖ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరికొన్ని గంటల్లో వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. వీరి వివాహం ఉదయ్ పూర్ లో జరగనుంది. రష్మిక, విజయ్ వివాహం రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్ లో ఉన్న ఐటీసీ హోటల్లో గ్రాండ్ గా జరగనుంది. వారి వివాహ వేదిక వద్ద మూడు అంచెల భద్రతను మోహరించినట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం, అంతర్జాతీయ భద్రతా మధ్య ఈ వేడుక జరగనుంది. వీరి వివాహానికి కొద్దిమంది అతిధులు మాత్రమే హాజరుకానున్నారు. అంబానీకి కుటుంబం విజయ్ దేవరకొండ వివాహానికి హాజరు కానున్నారు. ఇప్పటికే అంబానీ ఫ్యామిలీ ఉదయ్ పూర్ కు చేరుకుంది. అదేవిధంగా విజయ్ దేవరకొండ , రష్మిక వివాహానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. ప్రధాని మోడీ లేఖ రాశారు. ఫిబ్రవరి 26 న విజయ్ , రష్మిక వివాహం జరగనుంది. కాబోయే వధూవరులకు మోడి శుభాకాంక్షలు తెలిపారు. సప్తపదితో జీవితాంతం స్నేహంతో వర్ధిల్లాలని ఆశీస్సులు అందజేశారు. అలాగే విజయ్ రష్మిక జీవితం అద్భుతంగా ఉండాలని కోరుకుంటూ.. పరస్పరం గౌరవం, ప్రేమ, బాధ్యతలను పంచుకోవాలని మోడి సూచించారు. కాగా విజయ్, రష్మిక వివాహానికి కేవలం 100 మంది అతిథులను మాత్రమే ఆహ్వానించారు. అతిథులు, సన్నిహితుల కోసం మార్చి 4న హైదరాబాద్ లో రిసెప్షన్ నిర్వహించనున్నారు. అభిమానుల కోరిక మేరకు తమ పెళ్లి వేడుకకు 'విరోష్' అని పేరు పెట్టినట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

# ఆస్పత్రి నుంచి శరద్ పవార్ డిశ్చార్జ్

**ముంబయి,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

ఇటీవల అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ఎన్‌సిపి నేత శరద్‌పవార్ పూనెలోని రూబీ హాల్ ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్‌కు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు ఆదివారం ఈ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడడంతో బుధవారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శరద్‌పవార్ బాగానే ఉన్నారు. అందుకే ఆయనను డిశ్చార్జ్ చేశాం. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించాం

# ఒడిషాలో అవినీతి అనకొండ

## 30వేలు లంచం కేసులో దొరికిన మైన్స్ అధికారి

## సోదాల్లో కోట్లలో నగదు కట్టలు పట్టివేత

**భువనేశ్వర్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ఒడిశా విజిలెన్స్ అధికారుల చేతికి భారీ అవినీతి తిమింగలం దొరికింది. 30 వేల రూపాయలు లంచం తీసుకుంటూ దొరికిన ప్రభుత్వ ఉన్నతాధికారి ఇంట్లో కోట్ల రూపాయల సొమ్ము బయటపడింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. కటక్‌కు చెందిన దేబబ్రత మొహంతి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. దేబబ్రత లంచాలకు అలవాటు పడ్డాడు. తన దగ్గరకు అనుమతుల కోసం వచ్చే వారినుంచి పెద్ద మొత్తంలో లంచాలు తీసుకునే వాడు. ఈ నేపథ్యంలోనే స్థానిక బొగ్గు వ్యాపారి ట్రాన్స్‌పోర్ట్ పర్మిషన్‌ల కోసం దేబబ్రత దగ్గరకు వెళ్లాడు. ట్రాన్స్‌పోర్ట్ పర్మిషన్ ఇవ్వడానికి దేబబ్రత 30 వేల రూపాయలు లంచం అడిగాడు. దీంతో ఆగ్రహానికి గురైన బొగ్గు వ్యాపారి విజిలెన్స్ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం రాత్రి 30 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఉండగా అధికారులు దేబబ్రతను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భువనేశ్వర్, పటియాలోని దేబబ్రత ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అధికారుల కళ్లు చెదిరేలా భారీ స్థాయిలో డబ్బు, బంగారం దొరికింది. లెక్కల్లో చూపని నాలుగు కోట్ల రూపాయల్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ డైరెక్టర్ యశ్వంత్ జెత్వా మీడియాతో మాట్లాడుతూ.. 'ఇది ఒక సాధారణ లంచం కేసు

# ప్రేమపేరుతో మోసం చేసిన యువకుడు

## బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన ఓ యువకుడికి ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. ప్రియురాలిని మోసం చేసిన కేసులో అరెస్టైన అతడికి బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రియురాలితో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఆ తర్వాత జాతకాలు కలవలేదన్న సాకుతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ కేసు పెట్టింది. ఐపీసీ 376, బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రియుడిని అరెస్ట్ చేశారు. అతడు బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన హైకోర్టు అతడికి బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. కాలేజీ రోజుల నుంచే ఇద్దరికీ పరిచయం ఉన్నట్లు కోర్టు గుర్తించింది. వివాహం చేసుకుంటానని అతడు పలు మార్లు ప్రియురాలికి హామీ ఇచ్చినట్లు తేల్చింది. ప్రేమికుల వాట్సాప్ చాట్స్‌ను కోర్టు పరిశీలించింది.

# స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

## కడియం, దానంలపై తుది విచారణ

## 27,28 తేదీల్లో విచారణకు సిద్ధం

హైదరాబాద్,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక దశకు చేరుకొన్నది. ఇప్పటికే 8మంది విషయంలో స్పీకర్ స్పష్టమైన తీర్పును ఇచ్చారు. వీరు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని స్పీకర్ తీర్పును ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చబోతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు తమ వాదనలను వినిపించడంతోపాటు సాక్ష్యాధారాలను సమర్పించాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. స్పీకర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు దానం, కడియం సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. గత నెల 18న ఈ కేసులో పిటిషనర్ పాడి కౌశిక్‌రెడ్డిని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. 19న కడియం తరఫు లాయర్లు వివేకానందగౌడ్‌ను ప్రశ్నించారు. స్పీకర్ జారీచేసిన విచారణ షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27వ తేదీన ఉదయం 11:00 గంటలకు విచారణ ఉంటుంది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 12:00 గంటలకు విచారణ చేపడుతారు. 28వ తేదీన ఉదయం 11:00 గంటలకు బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉంటుంది. ప్రతివాది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరఫున సాక్ష్యాధారాలను సేకరిస్తారు.



# కోమలి ఆత్మహత్య ఘటనలో విషాదం

## ప్రేమికుడి తిరస్కరణతోనే ఆత్మహత్య

హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):

రాయదుర్గం పరిధిలో ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మణికొండ చిత్రపురి కాలనీలో తన మామ ఇంట్లో ఉంటోంది. మల్లారెడ్డి యూనివర్సిటీలో డిగ్రీ చదువుతు.. పార్ట్ టైమ్‌లో యూట్యూబ్ వీడియోలు చేస్తుంది. అయితే.. కోమలి అఖిల్ రెడ్డి అనే యువకుడిని ప్రేమించింది. పలు కారణాల వల్ల వీరిద్దరూ విడిపోయారు. ప్రస్తుతం అఖిల్ అండ్ ఫ్యామిలీ పరారీలో ఉంది. కోమలి ఆత్మహత్యకి ఒకరోజు ముందు కోమలి ప్లాట్‌కు అఖిల్ వెళ్లి ఆ యువతితో మాట్లాడాడు. తనను ప్రేమించి.. మరో అమ్మాయితో ప్రేమలో ఉండటాన్ని కోమలి జీర్ణించుకోలేక పోయింది.. ఇద్దరు అమ్మాయిలతో ప్రేమాయణం నడిపించాడు అఖిల్.. ఆత్మహత్యకి ముందు అఖిల్‌కి కోమలి మెసేజ్ చేసింది. ఈ విషయాన్ని తన అక్కకు చెప్పాడు అఖిల్.. అఖిల్ అక్క కోమలి ప్లాట్‌కి వెళ్ళి డోర్ కొట్టింది. ఎంతసేపటికీ తీయకపోవడంతో తిరిగి వెళ్లిపోయింది కానీ.. పోలీసులకు సమాచారం ఇవ్వలేదు.ఇదిలా ఉండగా.. కోమలికి ప్లాట్‌లో సూసైడ్ లెటర్ లభ్యమైంది. దీన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'నేను ముందుకు సాగడానికి భయపడుతున్నాను.. ఎందుకంటే అతను తిరిగి వస్తే? వదిలేయాలి అని నాకు తెలుసు. అతను నా వాడు కాదు అని తెలుసు.. అతను నాతో ఉండడానికి కూడా ప్రయత్నించడం లేదు అని తెలుసు.. కానీ నా లోపల చిన్న భాగం ఇంకా ఎదురు చూస్తోంది.. ఇంకా ఆశిస్తోంది.. ఒక రోజు అతను నన్నే ఎంచుకుంటాడని నా మనసు ఊహిస్తోంది. అందుకే ముందుకు సాగడం అసాధ్యంగా అనిపిస్తోంది.. ఎందుకంటే నేను చివరికి వెనక్కి తిరిగి నడిచి వెళ్లిన క్షణంలో.. అతను తిరిగి వచ్చి నన్ను వెతికితే..' అని సూసైడ్ లెటర్‌లో రాసుకొచ్చింది.

# చెవినొప్పితో ఆస్పత్రికి వెళితే..ఘోరం

## డాక్టర్ల నిర్లక్ష్యంతో యువకుడు మృతి

నిజామాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):

జిల్లాలో ఘోరం జరిగిపోయింది. చెవి నొప్పితో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరిన యువకుడు మృతి చెందటం తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికొచ్చిన కొడుకు అర్ధంతరంగా చనిపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో హాస్పిటల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన గంగం అజయ్ మంగళవారం  చెవి నొప్పితో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అజయ్ కండిషన్ చూసిన వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ కోసం మత్తు మందు ఇచ్చిన తర్వాత అజయ్ చనిపోయాడు. దీంతో ఆస్పత్రి వైద్యులు, మత్తు వైద్యుల నిర్లక్ష్యం మూలంగా అజయ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో వెంటిలేటర్, ఎలాంటి సౌకర్యాలు లేవు అంటూ కుటుంబ సభ్యులు  ఆరోపించారు. చేతికొచ్చిన కొడుకు చనిపోయాడని.. న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగారు. హాస్పిటల్ ఎదుటనే అజయ్ మృతదేహాన్ని దహనం చేస్తామని డీజిల్ డబ్బాతో ఆందోళనకు దిగారు కుటుంబ సభ్యులు. దీంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.వైద్యుల నిర్లక్ష్యంతో అజయ్ మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ సమయంలో ఎక్కువ మోతాదులో మత్తు మందు ఇవ్వటం వల్లనే అజయ్ మృతి చెందారని ఆందోళనకు దిగారు.

# రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

## బాన్సువాడలో శృతిమించిన ఎంఐఎం ఆగడాలు

## కామారెడ్డి, నిజామాబాద్ ఘటనలపై డిజిపికి బిజెపి ఫిర్యాదు

హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):

తెలంగాణలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. కామారెడ్డి ఘటనలో కాంగ్రెస్ గూండాగిరి బయటపడిందన్నారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డిని రామచంద్రరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి, నిమాజాబాద్ జిల్లాల్లో జరిగిన ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. కొన్నిరోజుల క్రితం బాన్సువాడలో ఎంఐఎం నేతలు ఆందోళనలు సృష్టించారని తెలిపారు. ఈ ఘటనపై నిరసన తెలిపిన హిందూ యువకులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. దాదాపు 27 మంది హిందూ యువకులను జైలుకు పంపారని తెలిపారు. హిందూ కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ నేతలు దాడి చేసేందుకు యత్నించారని ఆయన అన్నారు. నిజామాబాద్‌లో అడ్వకేట్ కళ్యాణిపై ఎంఐఎం నేతలు దాడి చేశారని ఆరోపించారు. 'నామ్ కే వాస్తే' దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని రామచంద్రరావు తెలిపారు. చాంద్రాయణ గుట్ట, ముత్యాలమ్మ గుడి, సికింద్రాబాద్‌లో హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం వద్దే హోం శాఖ ఉందని.. తెలంగాణలో మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని ఆయన విమర్శలు గుప్పించారు. పోలీసులు అరెస్ట్ చేసిన హిందూ యువకులను వెంటనే విడుదల చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామచంద్రరావు డిమాండ్ చేశారు.

# కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ

## దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## పసిపాప కుటుంబానికి కెటిఆర్ పరామర్శ

నాగర్‌కర్నూల్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):

నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన గొడవలో రెండు నెలల చిన్నారి మృతిచెందిన ఘటనలో దోషులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కెటిఆర్ పరామర్శించారు. తమకు న్యాయం చేయాలని చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. బాధిత కుటుంబం ఆందోళన చేస్తున్న శిబిరం వద్దకి వెళ్లి వారితో మాట్లాడి ధైర్యం చెప్పారాయన. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఘోరాతి ఘోరమైన మానవత్వానికి మచ్చ తెచ్చే విధంగా చిన్నారిని హత్యచేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లన్న జాతరలో చిన్నారి తల్లి దర్శనం అడిగినందుకు ఆ పాపను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. దేవుడు దర్శనం అడిగిన పాపానికి.. దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారని ఆగ్రహించారు. ఈ దారుణానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందేనని హెచ్చరించారు. పసిగుడ్డు ముఖం చూసి తండ్రిని వదలిపెట్టమని ప్రాధేయపడ్డ.. వదలకుండా కాలితో ఆ పాపను తన్నితే చనిపోయింది. యూనిఫామ్‌కి విలువ లేకుండా హంతకులను కాపాడే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారు. రెండు నెలల పసిగుడ్డుకు కులం తెలుసా..?, మనుషులను చిన్నచూపు చూసి దర్శనానికి రానివ్వకుండా చేయడం ఘోరం. హంతకులు ఎవరైనా.. ఏ పార్టీవారైనా కచ్చితంగా శిక్షించాల్సిందే. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సిందే. శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సిందే. పొత్తిళ్లలోని పసిగుడ్డును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాల్సిందే. న్యాయం జరిగేదాకా పోరాటం ఆపకండి. దుర్మార్గులను శిక్షించేదాకా వదిలిపెట్టొద్దు. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిదిమందిపై హత్యానేరం మోపకపోతే శాసనసభలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. బాధిత కుటుంబాన్ని కంటికి రెప్పల కాపాడుకుంటాం. కులం, మతం లేదు.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా మేం అండగా ఉంటాం' అని కేటీఆర్ భరోసా కల్పించారు.



# యూరియా కోసం సిపిఎం ధర్నా

నల్లగొండ,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):

రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలకు కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వానకాలం, యాసంగిలోనూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది.ప్రభుత్వం కొత్తగా యాప్ తీసుకొచ్చి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా నల్లగొండలో యూరియా సమస్యలు తీర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పానగల్లు పీఏసీఎస్ గోదాం దగ్గర స్మార్ట్ ఫోన్ పట్టుకుని బుకింగ్ కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

## క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిన అధికారులు

హైదరాబాద్,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయాన్నే చేరుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను ఆయా కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి సెండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9.97 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ ఉంటేనే అనుమతిస్తున్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా ఎంట్రీ ఉంటుంది. ఒక్క హాల్‌టికెట్ వెంట ఉంటే సరిపోతుంది. ఎలాంటి గుర్తింపు పత్రాలు అవసరంలేదు. ఊజాగా సమాధాన పత్రాల మూల్యాంకనం షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు ప్రకటించింది. మార్చి 4 నుంచి సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. మార్చి 15నుంచి మొదటి విడత, మార్చి 18నుంచి రెండో విడత, మార్చి 20 నుంచి మూడో విడత మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తారు.



# ఇంటర్ పరీక్షకు 17 నిముషాలు ఆలస్యం

## పరీక్షా కేంద్రానికి అనుమతించని అధికారులు

## కన్నీరు పెట్టుకున్న విద్యార్థిని శరణ్య

రాజన్నసిరిసిల్ల,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):

ఎగ్జామ్ సెంటర్‌కు ఆలస్యంగా రావడంతో ఇంటర్ విద్యార్థినిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. తన తండ్రి డ్రాప్ చేస్తాడేమోనని ఎదురుచూసి చూసి, చివరకు ఆర్టీసీ బస్సులో రావడంతో ఎగ్జామినేషన్ సెంటర్‌కు 17 నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. ఈ క్రమంలో అధికారులు పరీక్షకు అనుమతించకపోవడంతో.. సెంటర్ గేటు వద్దనే విద్యార్థిని కన్నీళ్లు పెట్టుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గొల్లపల్లికి చెందిన పిట్ల శరణ్య గొల్లపల్లి-బొప్పాపూర్ రాచర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ ప్రారంభం కావడంతో తన తండ్రి ఎగ్జామ్ సెంటర్ ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ దగ్గర దించుతానని చెప్పాడు. అయితే, పని చూసుకుని టైమ్ వరకు వస్తానని వెళ్లిన తండ్రి ఎంత సేపటికీ రాకపోవడంతో.. ఎగ్జామ్‌కు లేటవుతుందని గాబరాగాబరాగా బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడ ఆర్టీసీ బస్సు ఎక్కి ఎగ్జామినేషన్ సెంటర్‌కు చేరుకుంది. కానీ అప్పటికే 9.05 గంటలు దాటిపోవడంతో అధికారులు శరణ్యను ఎగ్జామ్ సెంటర్2లోనికి అనుమతించలేదు. దీనిపై శరణ్య కాలేజీ సిబ్బందిని, ఉన్నతాధికారులను సంప్రదించింది. ఈ క్రమంలో తహశీల్దార్ సుజాత ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకుని, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో శరణ్య 17 నిమిషాలు ఆలస్యంగా ఎగ్జామ్ సెంటర్ వద్దకు వచ్చినట్లుగా అధికారులు నిర్ధారించారు. దీంతో ఆమెను పరీక్షకు అనుమతించలేదు. తమ భవిష్యత్‌కు సంబంధించిన పరీక్షలు రాసేటప్పుడు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహశీల్దార్ సూచించారు.



# యూట్యూబర్ అన్వేష్ పై లుకౌట్ నోటీసులు

## విదేశాల్లో ఉండడంతో పంజాగుట్ట పోలీసుల వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):

యూట్యూబర్ అన్వేష్ పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఆయన విడుదల చేసిన ఒక వీడియోలో అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన ఆ వ్యాఖ్యలు సమాజంలో వివాదాస్పదంగా మారడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంపై స్పందించిన పంజాగుట్ట పోలీస్ అధికారులు, అన్వేష్ చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉండడంతో దేశంలోకి ప్రవేశించిన వెంటనే అదుపులోకి తీసుకునేలా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల అన్వేష్ తన సోషల్ మీడియా ద్వారా వీడియో విడుదల చేసి.. తనకు రెండు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, రెండు యూట్యూబ్ ఛానల్స్ ఉన్నాయని వెల్లడించారు. ఇందులో ఆయన ప్రధాన అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేసినట్లు తెలిసింది. దీనిపై కూడా పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసు దర్యాప్తు భాగంగా, అన్వేష్‌కు సంబంధించిన అకౌంట్ల వివరాలు, వీడియోల సమాచారం అందించాలని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలకు పోలీసులు అధికారికంగా లేఖ రాయనున్నట్లు

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
గురువారం 26 ఫిబ్రవరి 2026
7
www.prajaveekshanam.in

# యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

## ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

హైదరాబాద్ చిత్రపురి కాలనీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె ఇలా బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. నగరంలోని ఓ ప్రముఖ కాలేజ్‌లో బీఎస్సీ చదువుతున్న కోమలి.. చిత్రపురి కాలనీలో తన బంధువుల ఇంట్లో ఉంటోంది. విశాఖపట్నానికి చెందిన కోమలి.. తక్కువ కాలంలో యూట్యూబర్‌గా మంచి పేరు సంపాదించుకుంది. కోమలి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తిని ప్రేమించింది. ఏడాది క్రితం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో బ్రేకప్ అయ్యింది. ఈ నేపథ్యంలో కొన్ని నెలల క్రితం కోమలి ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు కాపాడారు. ఈ మధ్య మరోసారి ఆ యువకుడితో గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుంది. ఆమె తల్లి మంగళవారం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మచిలీపట్నం పాల కేంద్రాల్లో తనిఖీలు

**మచిలీపట్నం,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన కల్తీ పాల ఘటన నేపథ్యంలో ఏపీలోని వివిధ జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల సరఫరా కేంద్రాలు, డైరీలపై తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పలు పాల కేంద్రాలపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్, చిలకలపూడి ప్రాంతంలోని పాల కేంద్రాల్లోని పాలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పరిశీలించారు. ఎస్.ఎస్ మిల్క్, జిల్లా పరిషత్ కృష్ణవేణి మిల్క్ డైరీ పాల కేంద్రాల నుంచి పాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్స్‌కు పంపించారు. కొన్ని కేంద్రాల్లో ఎమ్మార్పీ, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేని, అత్యధిక కాలం ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన బాదం పాల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. రాజమహేంద్రవరం ఘటనలో కల్తీ పాలు తాగడం వల్ల పలువురు మృతి చెందగా.. మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

## తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షపై కన్వీనర్‌తో

# టి-సాట్ స్పెషల్ లైవ్

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

మే నెలలో నిర్వహించే ఎప్ సెట్ పోటీ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు టి-సాట్ నెట్వర్క్ ఈ నెల 26వ తేది గురువారం రోజు ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. లైవ్ కార్యక్రమంలో తెలంగాణ ఎప్ సెట్ కన్వీనర్ కె.విజయ్ కుమార్ రెడ్డి పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు పలు సలహాలు-సూచనలు అందించనున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, కోర్సులలో చేరేందుకు తెలంగాణ ప్రభుత్వం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ మే 13, 14 తేదిల్లో నిర్వహించనుంది. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు తోడ్పాటుగా టి-సాట్ నెట్వర్క్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. టి-సాట్ నిపుణ ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు జరిగే లైవ్ కార్యక్రమంలో పాల్గొనే కన్వీనర్ విజయ్ కుమార్ విద్యార్థుల సందేహాలకు సమాధానం ఇవ్వడంతో పాటు సలహాలు అందించనున్నారు. ఎప్ సెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి తల్లిదండ్రులు 040-23556037, 23553473 టోల్ ఫ్రీ నెం.1800 425 4038 నెంబర్లకు కాల్ చేయాలని టి-సాట్ నెట్వర్క్ కోరింది. ఇప్పటికే ఎప్ సెట్ పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ నాలుగు గంటల పాఠ్యంశాల ప్రసారాలను కొనసాగిస్తున్న విషయం పాఠకులకు విదితమే. తెలంగాణ విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష మరియు పోలీసు శాఖలో భాగమైన ఉమెన్ సేఫ్టీ వింగ్ సంయుక్తంగా 'చైల్డ్ సేఫ్టీ' పేరుతో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక ప్రత్యక్ష కార్యక్రమం కొనసాగనుంది. పిల్లల రక్షణ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పిల్లలకు ఇబ్బందులు ఎదురైతే ఎవరిని సంప్రదించాలి, విద్యార్థి దశలో ఎటువంటి విషయాల జోలికి వెళ్లకూడదు అనే తదితర ప్రధాన అంశాలపై విద్యార్థులను చైతన్య పరిచే కార్యక్రమం టి-సాట్ విద్య ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు ప్రసారమౌతుంది. విద్యార్థినీ, విద్యార్థులు తమ సందేహాలు-సమాధానాల కోసం 040-2354 0326, 2354 0726 టోల్ ఫ్రీ నెం.1800 425, 4039 నెంబర్లకు కాల్ చేయాలి. టి-సాట్ నెట్వర్క్ ఈ మేరకు సూచించింది.

# ఇంటర్ పరీక్షలకు సైబరాబాద్ పోలీసుల పటిష్ట బందోబస్తు

## ప్రత్యేక పోలీస్ బృందాలతో విద్యార్థులకు సహకారం

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షల నిర్వహణకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తున్నారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని నియమించి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు లేదా తప్పుడు అడ్రస్‌తో వేరే కేంద్రానికి చేరుకున్న వారిని వెంటనే గుర్తించి, పోలీస్ వాహనాల ద్వారా సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేర్చారు. ఇప్పటివరకు దాదాపు నలుగురు విద్యార్థులను సైబరాబాద్ పోలీసులు సరైన పరీక్షా కేంద్రాలకు చేర్చారు. పరీక్షల బందోబస్తును పరిశీలించేందుకు కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగిరెడ్డి కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతతో పాటు సహాయక చర్యలు కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయ్ వర్ధన్ బందోబస్తు సిబ్బందిని సమీక్షించి, పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

## - పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలి - కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు

## - బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి - అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయండని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పశు సంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఆర్థిక స్వావలంబన లభించే పథకాలను రూపొందించి అమలుచేద్దాం అని అన్నారు. తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచేలా పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్ధేశర చేశారు. . కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బ్జడెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి రాష్ట్రంలో జరుగాలని మంత్రి శ్రీహరి అన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.పాడి రంగానికి సంబంధించి అన్ని అంశాలు బ్జడెట్‌లో పొందుపరచాలని, పాల ఉత్పత్తి,



అందుకావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీహరి అన్నారు. పాడి పరిశ్రమ బలోపేతం, సమన్వయం కోసం ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించుకోవాలని, దానివల్ల పాల ఉత్పత్తిని పెంచుకోవొచ్చని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. వెటర్నరీ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు కూడా బ్జడెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పశు వులకు టీకాలు, ఔషధాల సరఫరా జరిగేలా, దానికి బ్జడెట్‌లో కేటాయింపులు ఉండాలని అధికారులకు మంత్రి వివరించారు. గతంలో లాగా కాకుండా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయాలని మంత్రి అధికారులకు వివరించారు. ఈసమీక్ష సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఈంఅ, డైరెక్టర్ గోపీ, డెయిరీ డెవలంప్‌మెంట్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, పివి నర్సింహరావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.జ్ఞానప్రకాశ్, ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ చేయనున్నారు.ఈ మేరకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు..అభ్యర్థుల వివరాలు విడుదల చేసింది. ఈ నెల 28వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణకు గడువు విధించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం మెరిట్ లిస్ట్ విడుదల చేయనున్న బోర్డు. మార్చి చివరి నాటికి ఉద్యోగాల్లో చేరనున్న కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్లు అని పేర్కొంది.

# జగద్గిరిగుట్టలో 14 తులాల బంగారం అపహరణ

## పక్కా ఆధారాలతో నిందితుడి అరెస్టు

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

బయటకు వెళ్తూ ఇంటి తాళం చెవిని దాచిన చోటే దొంగకు దొరకడంతో.. పని సులువైందనుకున్నాడో దొంగ. అదను చూసి ఇంట్లోకి ప్రవేశించి 14 తులాల బంగారు ఆభరణాలను దోచి ఉడాయించాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మబండలో వెలుగుచూసింది. జగద్గిరిగుట్ట డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీకి చెందిన రేకపల్లి లక్ష్మి (63) ఈ నెల 23న సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేశారు. ఆ తాళం చెవిని తలుపు పక్కనే ఉన్న డ్రమ్ కింద దాచి బయటకు వెళ్లారు. అయితే ఆమె తాళం దాస్తున్న విషయాన్ని అదే కాలనీకి చెందిన పత్రో శంకర్ (36) గమనించాడు. ఆమె వెళ్లగానే నిందితుడు డ్రమ్ కింద ఉన్న తాళంతో తలుపులు తీసి లోపలికి ప్రవేశించాడు. టీవీ టేబుల్‌పైనే ఉన్న అల్మారా తాళం చెవులతో లాకర్‌ను తెరిచి అందులోని సుమారు 14 తులాల బంగారు నగలను దొంగిలించి పరారయ్యాడు. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్న లక్ష్మి దంపతులు, అల్మారా తెరిచి ఉండటం చూసి ఆందోళన చెందారు. నగలు పోయినట్లు గుర్తించి వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు, సాంకేతిక ఆధారాల లతో నిందితుడు పత్రో శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు దొంగతనం విషయమై అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఒక బంగారు హారం, నల్లపూసల గొలుసు, మూడు పొరల గొలుసు, లాకెట్ ఉన్న గొలుసు, నాలుగు ఉంగరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.




# హైకోర్టులో ఐపిఎస్ అధికారి నాయక్ ముందస్తు బెయిల్

**అమరావతి,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ఏపీ హైకోర్టులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ బుధవారం ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సునీల్ నాయక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. రఘురామ అరెస్ట్ సమయంలో ఏపీ సీఐడీ ఎస్పీగా ఆయన ఉన్నారు. రెండు రోజుల క్రితం సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసేందుకు ఎస్పీ దామోదర్ బిహార్ వెళ్లారు. ఈ క్రమంలోనే ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించింది బిహార్ కోర్టు. దీంతో ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు

# సిఐడి నుంచి సైబరాబాద్‌కు రెండు జాగిలాలు

## 18కి చేరిన జాగిలాల సంఖ్య

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

తెలంగాణ రాష్ట్ర సిఐడి నుంచి రెండు పోలీస్ కేనైన్‌లు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు రిపోర్ట్ చేసినట్లు సిఎస్‌డబ్ల్యూ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ హనుమంతరావు తెలిపారు. ఈ రెండు కేనైన్‌లతో కలిపి ప్రస్తుతం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ జాగిలాల మొత్తం సంఖ్య 18కి చేరిందన్నారు. వీటిలో పేలుడు పదార్థాల గుర్తింపుకు 12, మాదకద్రవ్యాల గుర్తింపుకు 2, ట్రాకర్ జాగిలాలు 4 ఉన్నాయని చెప్పారు. సిఐడి నుంచి రిపోర్ట్ చేసిన కేనైన్‌లలో 'రానా' (బెల్జియన్ మాలినోయిస్, 4 ఏళ్లు), 'రాడో' (లాబ్రడార్, 10 ఏళ్లు) ఉన్నాయని వెల్లడించారు. నేరాల ఛేదన, పేలుడు పదార్థాల గుర్తింపు, ట్రాకింగ్ వంటి కీలక విధుల్లో ఈ కేనైన్‌లు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఏడీసీపీ తెలిపారు. బీడీ టీం ఆర్ఐ నాగరాజు సారథ్యంలో, ఆర్ఎస్ఐ వెంకటేష్ సహకారంతో ఈ కేనైన్‌ల సేవలు మరింత సమర్థంగా వినియోగంలోకి వస్తాయని పేర్కొన్నారు. పోలీస్ కేనైన్‌లను విధుల ప్రకారం విభజించారని తెలిపారు. పేలుడు పదార్థాల గుర్తింపు కేనైన్‌లు ప్రముఖుల కార్యక్రమాలు, ప్రజా ప్రతినిధుల సమావేశాలు, యాంటీ సబోటాజ్ చెకింగ్, బెదిరింపు కాల్స్ వంటి సందర్భాల్లో ఉపయోగపడుతున్నాయని వివరించారు. ట్రాకర్ కేనైన్‌లు నిందితులను గుర్తించడం, మిస్సింగ్ వ్యక్తులు లేదా వస్తువులను వెతకడం, సాక్ష్యాలు కనుగొనడంలో దర్యాప్తుకు సహాయపడుతున్నాయన్నారు. నార్కోటిక్ కేనైన్‌లు గంజాయి, కొకైన్, మెతాంఫెటమైన్, ఓపియం, ఎండీఎంఏ, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలను గుర్తించడంలో కీలకంగా పనిచేస్తున్నాయన్నారు. సైబరాబాద్ పోలీస్ కే9 స్క్వాడ్ విభాగం జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటుతోందని తెలిపారు. నార్కోటిక్ కేటగిరీకి చెందిన కేనైన్ 'తేజ' 2024-25లో రాంచీలో జరిగిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో కాంస్య పతకం సాధించడంతో పాటు, హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌లో కూడా కాంస్య పతకం గెలుచుకుందన్నారు. పేలుడు పదార్థాల గుర్తింపు కేటగిరీకి చెందిన కేనైన్ 'రీనా' తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ 2024లో హైదరాబాద్‌లో, అలాగే 2025లో వరంగల్‌లో జరిగిన పోటీల్లో కాంస్య పతకాలు సాధించిందని పేర్కొన్నారు. బ్రీడ్‌ల వారీగా లాబ్రడార్ బ్రీడ్‌కు చెందిన కేనైన్‌లు ఎక్కువగా ఉండగా, డోబర్‌మాన్, బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్‌ల కేనైన్‌లు కూడా సేవలందిస్తున్నాయి. లాబ్రడార్ బ్రీడ్ కెనడా మూలాలు కలిగి బ్రిటన్‌లో అభివృద్ధి చెందినదిగా, డోబర్‌మాన్ జర్మనీకి చెందినదిగా, బెల్జియన్ మాలినోయిస్ బెల్జియంకు చెందిన ప్రత్యేక శిక్షణ బ్రీడ్ అని తెలిపారు.

# వేర్వేరు ప్రాంతాల్లో ప్రేమ జంట ఆత్మహత్య

**వనపర్తి,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

వనపర్తి జిల్లాకు చెందిన ప్రేమ జంట వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. వనపర్తి జిల్లా పానగల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కేత్రావత్ వసంత అనే యువతి బాసర ఐఐటీ హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.వనపర్తి మండలం అప్పయ్య పల్లి శివారులోని కిర్యా తండా చెందిన గణెళిష్ కూడా ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఈ ఇద్దరు చనిపోవడానికి ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. వసంత, గణెళిశ్.. ఇద్దరూ బంధువులు అని తెలిసింది. వసంత ఇంజినీరింగ్ సెకండియర్ చదువుతుంది. వసంత హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసి పోలీసులు స్పాట్ కు వెళ్లారు. వసంత మృతదేహాన్ని భైంసా అసుపత్రికి తరలించారు. వసంత తల్లిదండ్రులకు కాల్ చేసి విషయం చెప్పారు. భైంసా ఆసుపత్రి ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్?లో రూమ్?మేట్స్?ను, ఐఐటీ క్యాంపస్?లో వసంత ఫ్రెండ్స్ ను పోలీసులు ఆమె గురించి ఆరా తీశారు. వసంత ప్రేమలో ఉందనే విషయం మాత్రం పోలీసులు విచారణలో స్పష్టమైంది.

# వేంపల్లె నందీశ్వరాలయంలో ప్రతిష్ఠ

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్ జగన్

**పులివెందుల,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత.. వైఎస్ జగన్ మధ్యాహ్నం నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించనున్నారు. అయితే దీనికి ముందుగా పులివెందుల నివాసం నుంచి బయలుదేరిన వైఎస్ జగన్? వైఎస్ రాజారెడ్డి సోదరిని పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.

# డయేరియా ప్రబలడంతో ఒకరు మృతి

## విధుల్లో నిర్లక్ష్యం..కమిషనర్‌పై వేటు

**అమరావతి,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. నగరంలో డయేరియా ప్రబలడంతో ఒకరు మృతిచెందగా.. 76 మంది ఆస్పత్రి పాలయ్యారు. విధుల్లో కమిషనర్ కూర్మారావు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలింది. దమ్మలవీధి, గోల్కొండ రేవు, కాకివీధి, మంగువారితోట తదితర ప్రాంతాలకు చెందినవారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరారు. మరోవైపు ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో ఇంటింటా సర్వే నిర్వహించింది. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి స్వల్ప లక్షణాలతో బాధపడుతున్న వారికి చికిత్స అందిస్తోంది. నగరపాలక సంస్థ సిబ్బంది ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేస్తున్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో 2,721 డయాలసిస్ మిషన్లు

## మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతి,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,721 డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. ఏపీలో డయాలసిస్ కేంద్రాల సంఖ్య పెంపుపై శాసనమండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానం ఇచ్చారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డయాలసిస్ కేంద్రాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 14 కొత్త డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. గతంలో నెలకు సుమారు 40 వేల డయాలసిస్ సెషన్లు జరుగగా... ప్రస్తుతం 66 వేల సెషన్లకు పెరిగాయని మంత్రి తెలిపారు. 675 మంది పేషెంట్లకు నెలకు 10 వేల రూపాయల చొప్పున పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగులకు కూడా పింఛన్లు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. కిడ్నీ రోగుల చికిత్సపై సగటున 86 వేల రూపాయల చొప్పున గత 20 నెలల్లో మొత్తం 224 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# మచిలీపట్నంలో పట్టపగలే భారీ దోపిడి

## టీచర్ ఇంట్లో 50 తులాల బంగారం, నగదు చోరీ

**మచిలీపట్నం,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. చిలకలపూడి సర్కార్ తోట ప్రాంతంలో ఓ ఉపాధ్యాయురాలి ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. గుడ్లవల్లేరు మండలం కౌతరం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మార్గరెట్ బుధవారం ఉదయం తన ఇంటికి తాళాలు వేసుకొని పాఠశాలకు వెళ్లారు. రంజాన్ మాసం కావడంతో పాఠశాలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించడంతో ఆమె ఇంటికి వచ్చారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగిందని నిర్ధరించుకుని.. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దాదాపు 50 తులాల బంగారం, రూ. 1,40,000 నగదు చోరీ జరిగినట్లు బాధితురాలు తెలిపారు.

# దొంగతనాలకు అలవాటు పడ్డ ఉద్యోగి

**విజయవాడ,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రూరల్ మండలం చిక్కుళ్లగూడెం గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడిని విజయవాడకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అసిస్టెంట్ లైన్‌మెన్ నంద సుభాష్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద సుభాష్ చెడు వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే తిరువూరు మండలం గానుగపాడు గ్రామంలో బైక్ చోరీ చేశాడు. దొంగిలించిన బైక్‌పైనే వృద్ధురాలైన ఉప్పు అనసూర్య మెడలో 40 గ్రాముల బంగారు నాన్తాడు చైన్‌ను లాక్కెళ్లిపోయాడు. తిరువూరు సీఐ కే. గిరిబాబు నిందితుడిని లక్ష్మీపురం శివారులో అరెస్టు చేశారు. దొంగిలించిన బంగారంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# హెరిటేజ్‌కు వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఏం సంబంధం

## జగన్ చేసే ఆరోపణలకు సమాధానం చెప్పాలా

## బొత్స దృష్టిలో గజదొంగ అంటే జగనా - మీడియా చాట్‌లో లోకేశ్

**అమరావతి,ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం):**



బాబాయ్‌ని చంపి కత్తి తమ చేతిలో పెట్టినట్లే.. వీఎస్ఆర్ ఏవియేషన్ విషయంలో వైకాపా ఆరోపణలు ఉన్నాయని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. మీడియా ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదు. హెరిటేజ్ ఫిన్ లీస్ అనేది 1996లో స్థాపించిన సంస్థ. అనేక ఇతర సంస్థల మాదిరిగానే 2022లో హెరిటేజ్ ఫిన్ లీస్ వద్ద వీఎస్ఆర్ ఏవియేషన్ ఫైనాన్స్ తీసుకుంది. ఆరోజు మేము అధికారంలోకి వస్తామని, మా ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని కలగన్నామా? అజిత్ పవార్ వీఎస్ఆర్ ఫ్లైట్ ఎక్కుతారని.. అది ప్రమాదానికి గురవుతుందని ఊహించామా?. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకు నేను ఎందుకు సమాధానం చెప్పాలి? క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం చెబుతాం. వీఎస్ఆర్ ఏవియేషన్ వ్యవహారంపై పూర్తి వివరాలు అందిస్తా అని లోకేశ్ అన్నారు. చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగలను వదిలేస్తున్నారన్న బొత్స వ్యాఖ్యలపై కూడా లోకేశ్ స్పందించారు. జగన్ గజ దొంగ అని బొత్స చెబుతున్నారా.. జగన్‌ను పట్టుకోవాలని చెబుతున్నారా..? అని ప్రశ్నించారు. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకి తానెందుకు సమాధానం చెప్పాలి..? అని నిలదీశారు. క్లారిటీ ఇవ్వాల్సిన అవసరమున్న ప్రతి ప్రశ్నకు ధీటైన సమాధానం తాము చెబుతామని పేర్కొన్నారు.జగన్‌ను పట్టుకోమని ఆయన చెబుతున్నారా? అని నిలదీశారు. సిట్ అధికారుల విచారణలో తేలిందంతా అదే కదా అని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో తమపై ఆరుకు పైగా కేసులు పెట్టారని.. ఫైబర్‌నెట్, స్కిల్, ఇన్నర్ రింగ్ రోడ్డు, లిక్కర్, ఇసుక, అసైన్‌మెంట్ భూములపై కేసులు పెట్టారని తెలిపారు.చార్జిషీట్ దాఖలు చేసేటప్పుడు కాంపిటెంట్ అథారిటీ నుంచి ఆమోదం పొందాలని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంత్రులకు అయితే గవర్నర్.. ఎమ్మెల్యేలు అయితే అసెంబ్లీ స్పీకర్ దగ్గర పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. గవర్నర్‌కు ఆధారాలు ఎందుకు చూపలేదని, ఒక్క ఆధారమైన చూపారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ హయాంలో పెట్టినవన్నీ తప్పుడు కేసులేనని ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేకు ఓ యూనివర్సిటీ పెట్టామని, రెసిడెన్షియల్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు వారంతా పార్టీ కార్యాలయంలోనే ఓరియెంటేషన్ క్లాస్‌లో ఉండాలని సూచించారు. ఈ ఒరియేనీటేషన్‌కి ప్రిన్సిపాల్ సీఎం చంద్రబాబు అని ప్రస్తావించారు. తాము అంతా విద్యార్థులమేనని.. ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిగే సమావేశాలు.. రాజకీయాలకు అతీతమని... ఫ్యామిలీ కాన్సెప్ట్‌లోనే ఇది జరుగుతుందని వివరించారు. ఈ భేటీలో రాజకీయ ప్రస్తావన లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# వెలిగొండ పూర్తి కాకుండానే జగన్ రిబ్బన్ కట్

- పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం
- వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా
- పనిచేసే ప్రభుత్వాని అండగా ఉండాలి
- ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా
- వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన చంద్రబాబు

**మార్కాపురం,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నా నని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్లు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు.



2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏఏ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. లలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు. జూన్ 15వ తేదీ నాటికి టన్నెల్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తానని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రతి సోమవారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చేసిన వారికి అండగా ఉంటేనే మీ జీవితాలు మారతాయి. ప్రతి విషయంలో మీకు అండగా చంద్రన్న ఉంటాడు. మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారు చేస్తాం. పండ్లతోటల వల్ల రైతుల ఆదాయం బాగా పెరుగుతుంది. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించా. ఈ ఏడాది వెలిగొండపై దృష్టి పెట్టానని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పరిశీలనలో ఆడబిడ్డ నిధి పథకం

## మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి సమాధానం

**అమరావతి,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ఆడబిడ్డ నిధి పథకం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల పింఛన్ల మొత్తాన్ని పెంచిందని మంత్రి వివరించారు. వృద్ధాప్య పింఛన్లను 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచామని, ఏడాదికి రూ.33 వేల కోట్లు పింఛన్ల రూపంలో ఖర్చు చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఏపీ శాసనమండలిలో 'ఆడబిడ్డ నిధి' పథకం అమలుపై వైసీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నలు లేవనెత్తారు. 'ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారు.. ఇచ్చే ఉద్దేశం ఉందా' అని ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు ప్రశ్నించారు. జూన్ 2024 నుంచే పథకాన్ని అమలు చేస్తామని ఎన్నికల సమయంలో బాండ్లు ఇచ్చారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి గుర్తుచేశారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. మంత్రి సమాధానం ఇస్తున్న సమయంలో సభలో వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో సూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పలు స్కీమ్‌లలో జరిగిన లోపాలను మంత్రి శ్రీనివాస్ చెబుతున్నారని తెలిపారు.

# జిల్లాలో సజావుగా ఇంటర్ పరీక్షలు..

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**విజయవాడ,ఫిబ్రవరి25(ప్రజా వీక్షణం):**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 23వ తేదీన ప్రారంభమై జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నాయి. పరీక్షల మొదటి రోజు నుంచే విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని, ఉత్సాహంగా పరీక్షలు రాస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులు సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనల మేరకు జరుగుతున్నాయా అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, సరైన విధంగా హాజరు నమోదు, ఇన్విజిలేటర్ల విధుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. పరీక్షా హాళ్లలో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్ష రాయడానికి తగిన డెస్కులు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి సదుపాయం, ఫస్ట్ ఎయిడ్ వంటి ఏర్పాట్లు ఉన్నాయా అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోంది. ప్రశ్నపత్రాల రవాణా, భద్రపరచడం వంటి అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇదే క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

# ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజా వీక్షణం, మంచిర్యాల:**

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల వేంపల్లి ప్రాంతంలోని ఎస్. ఆర్. ఆర్. కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి ఇంటర్మీడియట్ పరీక్షల పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రథమ సంవత్సరంలో జనరల్ 5 వేల 372 మంది ఒకేషనల్ 888 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5 వేల 227 మంది ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించాలని పరీక్ష సమయంలో 163 బి. ఎన్. ఎస్. ఎస్. సెక్షన్ అమలు చేయాలని పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా టి.జి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ప్రశ్నా జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధ్యం నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య హాజీపూర్ మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# , ప్రాణాన్ని కాపాడే రక్షణ ఆయుధం హెల్మెంట్:

## డీసీపీ బి. రామ్ రెడ్డి

### అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్,సీట్ బెల్ట్ ఉపయోగాలపై అవగాహన





**కమాన్ పూర్ ప్రజా వీక్షణం ఫిబ్రవరి 25.**

అరైవ్-అలైవ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా బుధవారం సుల్తానాబాద్ పట్టణంలో హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులకు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి,ఏసీపీ జి. కృష్ణ కలిసి గులాబీ పువ్వులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రతి మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వారిపై తరచుగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మంది ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని, త్రిబుల్ రైడింగ్ మరియు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని చెప్పారు. హెల్మెట్ మా శాసనం కాదు, మీ సంక్షేమం కోసం అని తెలిపారు. హెల్మెట్ ఒక వస్తువు కాదు, ప్రాణాన్ని కాపాడే రక్షణ ఆయుధమని పేర్కొన్నారు. రోడ్ చిన్నదైనా పెద్దదైనా ప్రమాదం ఎప్పుడైనా,ఎక్కడైనా సంభవించవచ్చని, అందువల్ల ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఈ చంద్ర కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టబద్ధతకు ప్రాధాన్యం పరిపాలనలో పారదర్శకత

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

పరిపాలన అంటే అధికార ప్రదర్శన కాదు, రాజ్యాంగ బద్ధమైన బాధ్యత , ఆ బాధ్యతను చట్ట పరిమితుల్లో, ప్రభుత్వం జారీ చేసిన జీవోల ఆధారంగా, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, జిల్లా పరిపాలనలో ఆయన తీసుకునే ప్రతి నిర్ణయం ఒక సంతకం కాదు , అది వేలాది కుటుంబాల భవిష్యత్తును ప్రభావితం చేసే బాధ్యత అని భావిస్తూ తనదైన శైలిలో జిల్లాను అభివృద్ధి పథంలో ఉంచేందుకు, స్పష్టమైన నమ్మకంతో పనిచేస్తున్న అధికారి మెజిస్ట్రేట్ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్.

**జీవోలకు ప్రాధాన్యం, నియమ నిబద్ధతకు మార్గదర్శి**

ప్రభుత్వం జారీ చేసే ప్రతి జీవోను లోతుగా అధ్యయనం చేసి, దాని ఉద్దేశ్యం, అమలు విధానం, చట్టబద్ధ పరిమితులను పూర్తిగా అర్థం చేసుకుని అమలు చేయడం ఆయన పరిపాలనా శైలి.

సంక్షేమ పథకాల అమలులో అర్హత ప్రమాణాల కచ్చితత్వం

భూ వ్యవహారాల్లో చట్టబద్ధ ప్రక్రియకు ప్రాధాన్యం

నిధుల వినియోగం, టెండర్ల లో పారదర్శక విధానం

"జీవోకు విరుద్ధంగా అడుగు లేదు" అనే నిబద్ధత జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన సందేశం, ప్రతి ఫైల్ వెనుక బాధ్యత, జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి ఫైల్‌ను పరిశీలించే సమయంలో చట్టబద్ధత, ఆర్థిక సమర్థత, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం, భవిష్యత్ ప్రభావం అని నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకొని, జాప్యం లేని త్వరిత సరైన స్పష్టమైన నిర్ణయం తీసుకోవడమే అసలు పరిపాలన అని ఆయన నమ్మకం.

**ప్రజా ప్రతినిధులతో సమన్వయం ప్రజాస్వామ్యానికి గౌరవం**

ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్‌లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు , సర్పంచ్‌లు వంటి అనేక ప్రజా ప్రతినిధులను గౌరవంగా ఆహ్వానిస్తూ, వారి సూచనలను పరిగణనలోకి తీసుకొని, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షల్లో ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను వినిపిస్తూ, జీవోల పరిమితుల్లో వాటిని అమలు చేసే మార్గాలను మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ సూచిస్తారు.

**పారదర్శకత , బాధ్యత , విశ్వాసం**

జిల్లా కార్యాలయాల్లో విధుల్లో భాగంగా తనదైన ముద్ర తెలిసే విధంగా , సమయ పాలన పెంచారు, ఫైల్ క్లియరెన్స్ వేగవంతం చేశారు,

పెండింగ్ ఫైళ్లపై ప్రత్యేక సమీక్షలు నిర్వహించి ఆలస్యాలను తగ్గించారు.

సంక్షేమ పథకాల అమలులో అర్హులకు న్యాయం జరిగేలా పున పరిశీలన విధానం అమలు చేశారు, అధికారులకు ఆయన ఇచ్చే స్పష్టమైన సందేశం , "ప్రజల విశ్వాసమే పరిపాలన బలం" అనే విధముగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోనే పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, జిల్లా శాఖలను మొత్తం ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ, భోజనం కూడా ఆఫీసులోనే తీసుకుంటూ మిగిలిన సమయాన్ని వృధా చేయకుండా, ప్రజలు వారి యొక్క సమస్యలను కలెక్టర్ దృష్టికి తెలియపరచడం కొరకు వచ్చిన వారిని కలిసి ఎందుకు ఆ సమయాన్ని కేటాయించి మరి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులకు బదిలీ చేస్తూ సమస్య పరిష్కారాలను నిర్వర్తిస్తూ, మహబూబాబాద్ జిల్లా అభివృద్ధికి నిరంతరం శ్రమించడం లో ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందేలా వారి యొక్క విధులు నిర్వహిస్తున్నరూ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్.

**ఫీల్డ్ విజిట్‌లు నిజమైన పరిపాలనకు నిదర్శనం**

కార్యాలయం దాటి గ్రామాల్లో, పాఠశాలల్లో, ఆసుపత్రుల్లో, అభివృద్ధి పనుల ప్రదేశాల్లో ప్రత్యక్ష పర్యటనలు నిర్వహిస్తూ వాస్తవ పరిస్థితులను అంచనా వేస్తు, సంబంధిత సైట్ వద్దే సమస్యలు గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడం, నాణ్యత లోపిస్తే రాజీ పడకుండా కఠిన చర్యలు సూచించడం ఆయన పరిపాలనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చింది.

**గుండెలను హత్తుకునే పరిపాలనా ధోరణి**

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పని విధానం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. అధికారం బాధ్యత నిబద్ధతలతో నిర్వహించలని, తీసుకునే నిర్ణయంలో వేగం కన్నా , న్యాయం జరిపేలా, స్పష్టమైన నిబద్ధత కలిగి ఉండాలనే ఆలోచన విధానం , తీసుకునే నిర్ణయాలలో కనిపించేలా వారి మార్కును కనబరుస్తారు. అందులో భాగంగా హాస్టలను సందర్శించినప్పుడు పిల్లలకు ఏర్పాటుచేసిన భోజనాలను దూరం నుండి గమనించి పోకుండా వారితో కూర్చొని భోజనాన్ని తిని సంబంధిత అధికారులకు తప్పిదం జరిగితే చర్యలకు గురవుతాం అనే భావన కలిగించేలా విద్యార్థులతో భోజనం చేస్తూ అధికారులంటే ఈ



విధంగానే ఉండాలి అనే విధంగా ప్రజల హృదయాలను గెలుపొందిన వ్యక్తి జిల్లా కలెక్టర్.

**నియంత్రణ కాదు ప్రజా సేవ కు ప్రాధాన్యత**

జీవోలను గౌరవిస్తూ, చట్టాన్ని పాటిస్తూ, ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ, ప్రజల విశ్వాసాన్ని కాపాడే విధంగా ముందుకు సాగుతున్న ఈ పరిపాలన మహబూబాబాద్ జిల్లా అభివృద్ధి ప్రయాణంలో ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తోందని మహబూబాబాద్ జిల్లా ప్రజలంతా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సేవలను కొనియాడుతున్నారు.

ఇండ్ల మహేష్

స్టాఫ్ రిపోర్టర్ మహబూబాబాద్

ప్రజా వీక్షణం న్యూస్

# శుభ కార్యక్రమాల్లో పాల్గొన్న రత్నాపూర్ సర్పంచ్.

**కమాన్ పూర్ ప్రజా వీక్షణం ఫిబ్రవరి 25.**

రామగిరి మండలం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు బుధవారం రోజున వివిధ శుభకార్యాలు, పరామర్శలలో పాల్గొన్నారు. సెంటినరీ కాలనీ కమ్యూనిటీ హాల్ లో కల్వచెర్ల మాజీ ఎంపీటీసీ కొట్టే సందీప్ పటేల్-రమ్య వివాహ వేడుకలు పాల్గొన్నారు, రత్నాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుడు బెజ్జాల భూమయ్యను పరామర్శించడం జరిగింది.రామ్ నగర్ లో అనారోగ్యం పాలైన కోమిరె కుమార్ ను పరామర్శించడం, ఆర్థిక సాయం చేశారు. రత్నాపూర్ గ్రామంలో పంప్ ఆపరేటర్ కండే సంజీవ్- రాజమణి గృహప్రవేశ వేడుకలలో పాల్గొన్నారు..





# గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం.

**కమాన్ పూర్ (రామగిరి) ప్రజా వీక్షణం ఫిబ్రవరి 25.**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం అని సర్పంచ్ పల్లె ప్రతిమా పివి రావు పేర్కొన్నారు. బుధవారంరామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీలో డీ షీల్టింగ్ పనులను బుధవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పరిశీలించారు. గత కొన్ని రోజులుగా గ్రామంలోని మురికి కాలువల లో పేర్కొన్న పోయిన చెత్తాచెదారాన్ని తాత్కాలిక పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారు. గత కొన్ని నెలలుగా చెత్తాచెదారం పేర్కొని పోవడంతో మురికి కాలువల నుండి దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలోని అన్ని మురికి కాలువలలో డీ షీల్టింగ్ పనులు నిర్వహిస్తున్నారు.

# మందు బాబులకు జైలు శిక్ష..

## - 27 మందికి 34,800 జరిమానా

## - ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్

**పెద్దపల్లి ప్రతినిధి,ప్రజా వీక్షణం:**



పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు మందుబాబులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ మేరకు తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటు న్నామని ఓ వైపు వారు హెచ్చరికలు చేస్తున్నా, శరా మామూలు గానే సాగుతున్నది. అయితే గత కొద్ది కాలంగా పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ వారి సిబ్బంది వాహ న తనిఖీలలో మద్యం సేవించి పట్టుబడిన 30 మంది వాహన దారులను బుధవారం పెద్దప ల్లి కోర్టులో హాజరుపరచ గా మెజిస్ట్రేట్ మంజుల విచారిం చి దుర్గం నరేందర్ కు రెండు రోజులు, గుండేటి సాగర్ 4 రోజులు జైలు శిక్ష, గడ్డం మల్లయ్యకు 5 రోజుల జైలు శిక్షను విధించారు. అలాగే మరో 27 మందికి 34,800 జరిమానా వేశారు. ఈ సంద ర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రమాదాల నివారణ లక్ష్యంగా మందుబాబులపై ప్రత్యేక దృష్టి సారించామని, రోడ్డు ప్రమాదాలలో అత్యధికంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే జరుగుతు న్నాయని అన్నారు.

# అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన 4వ వార్డ్ కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు

**మంథని ప్రతినిధి,ప్రజా వీక్షణం, ఫిబ్రవరి 25:**


మంథని మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ లో గల గంగాపురి అంగన్‌వాడీ పాఠశాలలో విలేజ్ హెల్త్, శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ దినోత్సవాన్ని ప్రతి నెల 4వ బుదవారం నిర్వహిస్తుండగా 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి టీకాలు వేసి పోషకాహార సలహాలతో పాటు అవగాహన కల్పించారు. గర్భిణీలకు అంటెనాటల్ చెకప్, బరువు, రక్తపోటు, హీమోగ్లోబిన్ పరీక్షలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లలిత, ఆశ వర్కర్ వేముల శ్రీదేవి , అంగన్వాడీ టీచర్ ఎరుకల శోభారాణి,ఆయా వనిత, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు



# పట్టణాన్ని కలిసి అభివృద్ధి చేసుకుందాం

## - ఎమ్మెల్యే విజయ రామణారావు




**పెద్దపల్లి ప్రతినిధి,ప్రజా వీక్షణం:**

పెద్దపల్లి పట్టణాన్ని అందరం కలిసి మరింత అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే విజయరామణారావు పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయ రమణారావు సమక్షంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య బాధ్యతలను స్వీకరించారు. ముందుగా చైర్మన్ చాంబర్‌లో వేదపండి తుల సమక్షంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం వారు చైర్మన్, వైస్‌చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య, శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు సమక్షంలో తన పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన పాలక వర్గానికి శు భాకాంక్షలు తెలిపి, చైర్మన్, పాలకవర్గం కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఆదరించి ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బా ధ్యతలను అప్పగించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ పట్టణంలో సామాన్య రైతు కుటుంబంలో తాను పుట్టి పెరిగానని, ఇక్కడి రోడ్ల మీద నడిచి కంచెర బావి నీళ్లు తాగి పెరిగినవాడినని తన పాత రోజులను గుర్తుకు చేసుకున్నారు. ఇక్కడి సమస్యలను దగ్గరగా చూశానన్నారు. అందుకే ఈ పదవిని అధికారం'గా కాకుండా, సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. పట్టణంలో ఇంకా చాలా మెరుగుపరచాల్సిన అంశాలు ఉన్నాయని వాటి అన్నిటిని అందరి సహకారం తో పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి శుభ్రమైన తాగునీరు, మంచి డ్రైనేజీ వ్యవస్థ, పక్కాగా తడి, పొడి చెత్త అమలు, రోడ్లు, వీధుల దీపాలు, పార్కుల అభివృద్ధి, మెరుగైన ఆరోగ్యం, విద్యా సౌకర్యాలు, యువతకు ఉపాధి అవకాశాలు, స్వచ్ఛతకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రజ ల నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని, పారదర్శకంగా, నిజాయితీగా, పక్షపాతం లేకుండా అందరికీ సమానంగా పనిచేస్తానని మాట ఇస్తున్నానని తెలిపారు. బాధ్యతలను స్వీకరించిన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌ను తోటి కౌన్సిలర్లు, అధికారులు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంథనిలో ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

-ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు

-పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతి

-పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన మంథని పోలీసులు

**మంథని ప్రతినిధి,ప్రజా వీక్షణం, ఫిబ్రవరి 25:**

ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం కాగా తొలిరోజు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. నేటి నుంచి మార్చి 18వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. మొదటి రోజు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు జరిగాయి. మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలికల కళాశాలలో మొత్తం 208 మంది విద్యార్థులకు గాను 202 మంది హజరు కాగా ఆరుగురు విద్యార్థులు గైహాజరయ్యారు.బాలుర కళాశాలలో 158 మందికి గాను 154 మంది విద్యార్థులు హాజరు కాగా నలుగురు గైహాజరయ్యారు. అదేవిధంగాముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 153 మంది విద్యార్థులకు గాను 151 మంది విద్యార్థులు హాజరు కాగా ఇద్దరు గైహాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలను చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని 5 నిమిషాలు ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతి కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేపటి నుంచి ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ కేంద్రలను మూసివేయాలని అధికారులు స్పష్టం చేశారు.





# పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మిట్ లో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించిన పోలీస్ లనూ అభినందించిన

## జిల్లా ఎస్పీ డా. శబరీష్



**మహబూబాబాద్, ప్రతినిధి (ఫిబ్రవరి 25) ప్రజా వీక్షణం న్యూస్ :**

హైదరాబాద్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026 లో మహబూబాబాద్ జిల్లా పోలీస్ సిబ్బంది విశేష ప్రతిభ కనబరచి పలు పతకాలు సాధించిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్ విజేతలను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా పతక విజేతలకు శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలు అందజేసి వారి ప్రతిభను కొనియాడారు. ఈ క్రీడా పోటీలలో మహబూబాబాద్ జిల్లా నుండి క్రింది అధికారులు, సిబ్బంది పతకాలు సాధించారు. ఎం. శ్రీనివాస్,డిఎస్పీ (ఏ.ఆర్ ) లాన్ టెన్నిస్ టీమ్ ఈవెంట్ స్వర్ణ పతకం విజయ్ ప్రతాప్, డిఎస్పీ (ఏ.ఆర్ ) లాన్ టెన్నిస్ టీమ్ ఈవెంట్ స్వర్ణ పతకం ఎం. లింగన్న, పీసీ 42 కి.మీ ఫుల్ మారథాన్ స్వర్ణ పతకం , క్రాస్ కంట్రీ ఇండివిడ్యువల్ ఈవెంట్ రజత పతకం బి. గణేష్, ఏ.ఆర్.పీ.సీ ఆర్మ్ రెజ్లింగ్ కాంస్య పతకం బి. సౌభాగ్య, మహిళా పీసీ జిమ్నాస్టిక్స్ ఫ్లోర్ స్వర్ణ పతకం , ట్రెడిషనల్ యోగా కాంస్య పతకం ఎ. ఉమా రాణి, మహిళా పీసీ క్రాస్ కంట్రీ టీమ్ ఈవెంట్ స్వర్ణ పతకం , ఖో–ఖో కాంస్య పతకం జి. రజిని, మహిళా పీసీ రిథమిక్ పేర్ యోగా కాంస్య పతకం , ఖో–ఖో కాంస్య పతకం ఎం. సంజీత, మహిళా పీసీ ఆర్టిస్టిక్ సింగిల్ యోగా కాంస్య పతకం కె. అనూష, మహిళా పీసీ ఖో–ఖో మహిళల విభాగం కాంస్య పతకం ఎల్. దివ్య, మహిళా పీసీ ఖో–ఖో మహిళల విభాగం కాంస్య పతకం బి. సౌజన్య, మహిళా పీసీ ఖో–ఖో మహిళల విభాగం కాంస్య పతకం ఈ క్రీడా పోటీలలో మహబూబాబాద్ జిల్లా పోలీస్ సిబ్బంది మొత్తం 6 స్వర్ణ పతకాలు, 3 రజత పతకాలు, 10 కాంస్య పతకాలు సాధించి మొత్తం 19 పతకాలు గెలుచుకుని జిల్లా ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో నిలబెట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ, తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్2026 లో మహబూబాబాద్ జిల్లా పోలీస్ సిబ్బంది సాధించిన విజయాలు గర్వకారణమని తెలిపారు. విధి నిర్వహణతో పాటు క్రీడలలో కూడా ప్రతిభ కనబరచడం పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, శారీరక మరియు మానసిక దృఢత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని విజేతలను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# యూరియా కోసం సిపిఎం ధర్నా

**నల్లగొండ,ఫిబ్రవరి 25( ప్రజా వీక్షణం):**

రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలకు కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వానకాలం, యాసంగిలోనూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది.ప్రభుత్వం కొత్తగా యాప్ తీసుకొచ్చి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా నల్లగొండలో యూరియా సమస్యలు తీర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పానగల్లు పీఏసీఎస్ గోదాం దగ్గర స్మార్ట్ ఫోన్ పట్టుకుని బుకింగ్ కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐ.పి.ఎస్

ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 'స్టాటిక్ ఫోర్స్'తో పటిష్ట భద్రత

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా వాతావరణం

**కరీంనగర్ ఫిబ్రవరి 25(ప్రజా వీక్షణం)**

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐ.పి.ఎస్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను ( స్టాటిక్ ఫోర్సెస్) కేటాయించామని, పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం

## - ములుగు జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు ఆత్మకూరి పట్టాబి

**ప్రజా వీక్షణం ములుగు ప్రతినిధి :**

ఆపదలో ఉన్న వారికి ఇచ్చే రక్తం మరొకరికి పునర్జన్మను ఇస్తుందని, రక్తదానం ప్రాణదానంతో సమానమని ములుగు జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆత్మకూరి పట్టాబి అన్నారు. బుధవారం వెంకటాపురం గ్రామంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు బొల్లె వెంకట చలమయ్య జ్ఞాపకార్థం, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ మరియు చేయూత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పట్టాబి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఆరోగ్యవంతుడైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడవచ్చని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి, వారిని అభినందించారు.గర్భిణులు, తలసేమియా బాధితుల కోసమే రక్తదాన శిబిరం అని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొప్పుల అన్నారు.ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల అవసరాల నిమిత్తం ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 33 యూనిట్ల రక్తాన్ని సేకరించామని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పవన్ కుమార్ రక్తదాన శిబిరం నిర్వాహకులు బొల్లె సుదీర్, భాను,దాసు, సౌమిత్, బట్టి విజయ సూర్య, తాటి శ్రావణ్, కూసం సాంబం, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు ఆదినారాయణ,పార్థు తదితరులు పాల్గొన్నారు.





ప్రజావీక్షణం
దినపత్రిక

SPORTS/ BUSINESS


గురువారం 26 ఫిబ్రవరి 2026

www.prajaveekshanam.in


# జింబాబ్వేతో మ్యాచ్ లో రింకూ సింగ్ అనుమానమే!



ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో ఇండియా ముందున్న తొలి సవాల్ జింబాబ్వే. ఫిబ్రవరి 26న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో భారత్, జింబాబ్వే జట్లు తలపడనున్నాయి. సూపర్-8లో ఒక ఓటమి తర్వాత భారత్‌కు ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై' లాంటిదే. దాంతో గురువారం జరగనున్న ఈ మ్యాచ్ టీమిండియాకు అత్యంత కీలకం కానుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచులో భారీ తేడాతో ఓటమి చెందడం జట్టుకు మైనస్ అయింది. ఇదే సమయంలో భారత జట్టుకు మరో షాక్ తగిలింది. బ్యాటర్ రింకూ సింగ్ ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా జట్టుకు తాత్కాలికంగా దూరమయ్యాడు. రింకూ తండ్రి ఆరోగ్యం విషమంగా ఉందని, ఆయనను ఆసుపత్రిలో చేర్పించినట్లు సమాచారం. లివర్ ప్రాబ్లమ్ తో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న తండ్రిని చూసేందుకు, కుటుంబానికి మద్దతుగా నిలిచేందుకు రింకూ సింగ్ తన స్వస్థలానికి వెళ్లిపోయాడు. దాంతో జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌లో రింకూ ఆడటం అనుమానమే. అయితే అతడి స్థానంలో జట్టులోకి ఎవరు వస్తారు అనేదానిపై చర్చ జరుగుతోంది. ఈ మ్యాచ్‌కు రింకూ సింగ్ అందుబాటులో లేకపోతే, కచ్చితంగా అక్షర్ పటేల్ అతడికి ప్రత్యామ్నాయం కావచ్చు. దాంతో పాటు బౌలింగ్ కూడా చేస్తాడు. చెన్నై పిచ్ సాధారణంగా స్పిన్ బౌలర్లకు సహకరిస్తుంది. కనుక ఈ పరిస్థితిలో అక్షర్ జట్టుకు అదనపు స్పిన్ ఆప్షన్‌గా మారతాడు. అక్షర్‌ను జట్టులోకి తీసుకుంటే భారత్ నలుగురు ఆల్‌రౌండర్లతో (శివం దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్) బరిలోకి దిగవచ్చు. దీనివల్ల బ్యాటింగ్ డెప్త్ పెరగడమే కాకుండా బౌలింగ్‌లోనూ బ్యాలెన్స్ వస్తుంది. జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఫాస్ట్ బౌలింగ్ బాధ్యతల్ని కొనసాగిస్తారు. వారికి పాండ్యా తోడవుతాడు. రింకూ లేకపోతే రెండవ ప్రత్యామ్నాయం సంజూ శాంసన్. సంజూ దూకుడుగా ఆడే బ్యాటర్. అవసరమైతే ఇన్నింగ్స్ ప్రారంభించగల ప్లేయర్. మిడిల్ ఆర్డర్‌లో కూడా బ్యాటింగ్ చేస్తాడు. టీమ్ మేనేజ్మెంట్ బ్యాటింగ్‌ను మరింత బలోపేతం చేయాలనుకుంటే ఈ మ్యాచులో సంజూకు అవకాశం ఇవ్వవచ్చు. దీనివల్ల భారీ షాట్లు ఆడగల అదనపు బ్యాటర్ భారత్‌కు అందుబాటులోకి వస్తాడు.భారత్‌కు ఈ మ్యాచ్ కేవలం మరో లీగ్ మ్యాచ్ మాత్రమే కాదు, సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలవాంటే భారీ విజయంతో నెగ్గాలి. నెట్ రన్ రేట్‌ను మెరుగుపరుచుకోవడానికి భారీ తేడాతో గెలవాల్సి ఉంటుంది.



అయితే బీసీసీఐ మేనేజ్ మెంట్ బ్యాటింగ్ బలాన్ని నమ్ముకుంటుందా, లేక ఆల్ రౌండర్ అక్షర్ ను జట్టులోకి తీసుకుంటుందా ఇప్పుడే చెప్పలేం. కానీ జింబాబ్వేపై సూర్యకుమార్ సేన అద్భుత విజయాన్ని సాధిస్తే ఆశలు సజీవంగా ఉంటాయి.

# సచిన్ విషయంలో తప్పు చేశాను

## అంపైర్ స్టీవ్ బక్నర్ కీలక ప్రకటన



క్రికెట్ చరిత్రలో అత్యంత వివాదాస్పద నిర్ణయాలలో ఒకటి మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. అందుకు కారణం సచిన్ విషయంలో తాను తప్పు చేశానని అంపైర్ స్టీవ్ బక్నర్ స్వయంగా అంగీకరించారు. 2003-04 ఆస్ట్రేలియా పర్యటనలో బ్రిస్బేన్ టెస్టులో క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్‌ను స్టీక్ బక్నర్ ఎల్బీడబ్ల్యూ అవుట్‌గా ప్రకటించిన ఘటన అభిమానులకు నేటికీ గుర్తుంది. అయితే 22 ఏళ్ల తర్వాత ఆ మ్యాచ్ అంపైర్ స్టీవ్ బక్నర్ తొలిసారిగా సచిన్ ఎల్బీడబ్ల్యూ నిర్ణయం తప్పని బహిరంగంగా అంగీకరించారు. 79 ఏళ్ల బక్నర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆ రోజు బంతి స్టంప్స్‌ను తాకడం లేదని, తాను సచిన్‌ను ఔట్ ఇచ్చి ఉండాల్సింది కాదన్నారు. ఆయన చేసిన ఈ ప్రకటనతో రెండు దశాబ్దాలుగా పలుమార్లు కొనసాగిన చర్చకు తెరపడింది. జీవితంలో కొన్ని తప్పులు జరుగుతాయని, సచిన్ విషయంలో తాను చేసిన తప్పును అంగీకరిస్తున్నానని బక్నర్ స్పష్టం చేశారు. 2003-04లో బ్రిస్బేన్‌లో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జాసన్ గిలెస్పీ వేసిన ఒక బంతిని సచిన్ వదిలేయడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో బంతి సచిన్ ప్యాడ్లకు తగిలింది. ఆస్ట్రేలియా ఆటగాళ్లు గట్టిగా అప్పీల్ చేయడంతో అంపైర్ స్టీవ్ బక్నర్ ఆ అప్పీల్‌ను అంగీకరిస్తూ వేలెత్తి సచిన్‌ను ఔట్ అని ప్రకటించారు. ఆ సమయంలో సచిన్ కేవలం 3 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. తరువాత టీవీ రిప్లేలో బంతి స్టంప్స్ పైనుంచి వెళ్తున్నట్లు స్పష్టంగా కనిపించింది. కామెంటరీ బాక్స్‌లో ఉన్న దిగ్గజ వ్యాఖ్యాత టోనీ గ్రేగ్ కూడా దీనిని చెత్త నిర్ణయంగా పేర్కొన్నారు. ఇది చాలా దారుణమైన నిర్ణయం. నిర్ణయం తీసుకునే ముందు బంతి లైన్, బౌన్స్‌ను అంపైర్ బక్నర్ గమనించి ఉండాల్సింది అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ రోజుల్లో డిఆర్ఎస్ వ్యవస్థ అందుబాటులో లేదు. అందువల్ల అంపైర్ నిర్ణయమే ఫైనల్ అని భావించేవారు. ఈ ఒక్క నిర్ణయం క్రికెట్ ప్రపంచంలో పెద్ద వివాదాన్ని సృష్టించింది. సచిన్‌కు వ్యతిరేకగా బక్నర్ గతంలో కూడా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని చాలా మంది భారత అభిమానులు నమ్మేవారు. బ్రిస్బేన్ టెస్ట్ లాంటి ఎన్నో ఘటనల్ని టీమిండియా ఫ్యాన్స్ ఎన్నటికీ మరిచిపోరు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ప్రతి పెద్ద మ్యాచ్ సమయంలోనూ సచిన్ కు వ్యతిరేకంగా బక్నర్ ఇచ్చిన నిర్ణయాలపై తరచుగా చర్చ జరిగేది. మరో మ్యాచులో సచిన్ భుజానికి తాకిన బంతిని క్యాచ్ పట్టి ఆసీస్ క్రికెటర్లు అప్పీల్ చేయగా, దాన్ని సైతం బక్నర్ ఔట్‌గా ప్రకటించడం అప్పట్లో మరో వివాదాస్పద నిర్ణయం. బక్నర్ తప్పిదాలతో సచిన్ ఎన్నో సెంచరీలు కోల్పోయారని భారత అభిమానులు గుర్తుచేసుకుంటారు. కొంతకాలం కిందట అంపైర్ స్టీవ్ బక్నర్ గురించి సచిన్‌కు ప్రశ్న ఎదురైంది. సచిన్ తనదైన శైలిలో సరదాగా సమాధానమిచ్చాడు. తాను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు అంపైర్‌కు బాక్సింగ్ గ్లౌజులు తొడిగించాలని, దాంతో ఆయన త్వరగా వేలు ఎత్తలేరని సచిన్ ఫన్నీగా స్పందించాడు. అంపైర్ తప్పిదం చేశాడని తెలిసి సచిన్ ఆశ్చర్యపోతూ క్రీజును వదిలిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

# ఐదో ర్యాంక్ దక్కించుకున్న ఇషాన్



ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్?లో టీమ్ఇండియా యువ సంచలనం ఇషాన్ కిషన్ గతకొన్ని రోజులుగా రాకెట్? స్పీడ్?లో దూసుకెళు న్నాడు. బ్యాటింగ్? విభాగంలో గతనెల టాప్ -50లో కూడా లేని ఇషాన్, తాజా ర్యాకింగ్స్?లో ఏకంగా టాప్ -5లోకి దూసుకొచ్చేశాడు. రెండేళ్ల తర్వాత ఇంటర్నేషనల్ క్రికెట్?లో రీఎంట్రీలో న్యూజిలాండ్?తో రెచ్చిపోయిన అతడు, ప్రస్తుత టీ20 వరల్డ్?కప్?లోనూ రాణిస్తున్నాడు. దీంతో లేటెస్ట్ ర్యాకింగ్స్?లో ఇషాన్ మరో మూడు స్థానాలు మెరుగుపర్చుకొని ఐదో ర్యాంక్ దక్కించుకున్నాడు. మరోవైపు యంగ్ బ్యాటర్ తిలక్ వర్మ టాప్ 5 నుంచి చోటు కోల్పోయాడు. టీ20 వరల్డ్?కప్?లో పేలవ ప్రదర్శన కొనసాగిస్తున్న తిలక్? తాజా ర్యాంకింగ్స్?లో మూడు స్థానాలు దిగజారిపోయాడు. ?దీంతో ప్రస్తుతం అతడు ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక సౌతాఫ్రికా సెన్సేషన్ ప్లేయర్ డివాల్డ్ బ్రేవిస్ ఏకంగా 10 స్థానాలు ఎగబాకాడు. ఫలితంగా అతడు టాప్ 10లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక టీమ్ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్?లోనే కొనసాగుతున్నాడు. ప్రస్తుత వరల్డ్?కప్?లో తిలక్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. వన్?డౌన్?లో బరిలోకి దిగుతున్నా ఇప్పటిదాకా అతడి నుంచి పెద్ద ఇన్నింగ్స్ రాలేదు. మొత్తం 5 మ్యాచ్?ల్లో అతడు కేవలం 107 పరుగులే చేశాడు. స్ట్రైక్ రేట్ కూడా 118 మాత్రమే ఉండడం గమనార్హం. దీంతో జింబాబ్వేతో సూపర్ 8 మ్యాచ్?లో అతడి ప్లేస్ డేంజర్?లో పడింది. అతడిని పక్కన పెట్టేసి ఇంకో ఆటగాడికి అవకాశం ఇవ్వాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.ఇషాన్ కిషన్ ఈ టోర్నీలో రాణిస్తున్నాడు. ఇప్పటిదాకా 5 మ్యాచ్?ల్లో 35 సగటుతో 176 పరుగులు చేశాడు. 193.41 స్ట్రైక్ రేట్?తో 19 ఫోర్లు, 11 సిక్స్?లు బాదాడు. ఈ వరల్డ్?కప్?లో భారత్ తరఫున కెప్టెన్ సూర్యకుమార్ (180 పరుగులు) అత్యధిక పరుగులు బాదిన బ్యాటర్?గా కొనసాగుతున్నాడు. సూర్య తర్వాత టీమ్ఇండియా తరఫున అత్యధిక పరుగులు బాదిన బ్యాటర్ ఇషాన్ కిషనే! అలాగే భారత్ యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా ఏడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. దీంతో టాప్ 10లోకి ఎంటర్ అయ్యాడు. ప్రస్తుతం 669 రేటింగ్స్?తో ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నాడు. వెస్టిండీస్ బౌలర్ మ్యాథ్యూ ఫోర్డే ఏకంగా 23 స్థానాలు ఎగబాకాడు. అతడు 679 రేటింగ్స్?తో ఏడో స్థానం దక్కించుకున్నాడు. ఇక వరుణ్ చక్రవర్తి (790 రేటింగ్స్) టాప్?లోనే కొనసాగుతున్నాడు.ఆల్?రౌండర్ల విభాగానికి వస్తే, జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్?లోకి దూసుకెళ్లాడు. అతడు ప్రస్తుతం 294 రేటింగ్స్?తో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇన్ని రోజులు టాప్?లో ఉన్న పాక్ క్రికెటర్ సైమ్ అయూబ్ రెండో స్థానానికి పడిపోయాడు. భారత్ స్టార్ ఆల్?రౌండర్ హార్దిక్ పాండ్య 272 రేటింగ్స్?తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.

# ఇంగ్లాండ్ నేరుగా సెమీ ఫైనల్‌లోకి ఎంట్రీ

2026 టీ20 ప్రపంచకప్ సూపర్-8 దశలో భాగంగా మంగళవారం పల్లెకెలేలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన కీలక మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 2 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్? విజయం సాధించింది. దీనితో నేరుగా సెమీఫైనల్?కు చేరుకుంది. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ వీరోచిత సెంచరీతో జట్టును గెలిపించి హీరోగా నిలిచాడు. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్?కు ఓపెనర్లుగా సాహిబ్‌జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్ మ్యాచ్?ను ఆరంభించారు. సైమ్ అయూబ్ 7 పరుగులు చేయగా, సల్మాన్ ఆఘా 5 పరుగులు చేసి ఔట్? అయ్యాడు. బాబర్ అజామ్ (25) పరుగులు చేశాడు. ఇందులో 7 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టారు. ఫఖర్ జమాన్ (25) పరుగులు, షాదాబ్ ఖాన్ 23 పరుగులు చేశారు. పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో లియామ్ డాసన్ 3 వికెట్లు తీయగా, జోఫ్రా ఆర్చర్, జామీ ఓవర్టన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం 165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ ఫేలవంగా ఆరంభించింది. ఇన్నింగ్స్ తొలి బంతికే ఫిల్ సాల్ట్ వికెట్ కోల్పోవడంతో ఇంగ్లాండ్ మంచి ఆరంభాన్ని మొదలుపెట్టలేక పోయింది. జోస్ బట్లర్ (2), టామ్ బంటన్ (2), జాకబ్ బెథెల్ (8), సామ్ కరన్ (16) వికెట్లు తక్కువ పరుగులకే ఔట్ కావడంతో ఒకానొక దశలో కష్టాల్లో పడింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్, విల్ జాక్స్ కలిసి స్కోర్ పెంచడానికి ప్రయత్నించారు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ కేవలం 50 బంతుల్లోనే 100 పరుగులు (10 ఫోర్లు, 4 సిక్సర్లు) బాది ఇంగ్లాండ్‌ను విజయతీరాలకు చేర్చాడు. చివరి ఓవర్లలో షాహీన్ అఫ్రిది (4 వికెట్లు) విజృంభించడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. జోఫ్రా ఆర్చర్ చివరి వరకు బౌండరీ కొట్టి తన జట్టుకు విజయాన్ని సాధించాడు. 19.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన ఇంగ్లాండ్ 2 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్? పాక్?పై విజయం సాధించింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ టీ20 ప్రపంచకప్?లో సెమీఫైనల్స్‌కు చేరుకుంది. హ్యారీ బ్రూక్ తన ఆల్ రౌండ్ ప్రదర్శనకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ పురుషుల టీ 20 ప్రపంచ కప్‌లో సెంచరీ సాధించిన మొదటి కెప్టెన్‌గా రికార్డును సృష్టించాడు. ఇంతకుముందు, ఈ రికార్డు 2010లో భారత్‌తో వెస్టిండీస్? తలపడినప్పుడు నమోదైంది. టోర్నమెంట్ చరిత్రలో క్రిస్ గేల్ చేసిన అత్యధిక స్కోర్? 98.ఈ విజయంతో ఇంగ్లాండ్ వరుసగా ఐదో సారి టీ20 ప్రపంచ కప్లో సెమీఫైనల్స్?కు చేరుకుంది. 2016లో వెస్ట్? ఇండీస్?తో జరిగిన టోర్నమెంట్ ఫైనల్లో ఓడిపోయినప్పుడు ఈ పరంపర ప్రారంభమైంది. అయితే ఇంగ్లాండ్? 2021, 2024లో సెమీస్ నుంచి నిష్క్రమించింది, కానీ 2022లో ఛాంపియన్లుగా గెలిచింది.



# రోహిత్ రికార్డుపై కన్నేసిన పాండ్యా



భారత సీనియర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన తరం అత్యుత్తమ టీ20 క్రికెటర్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. బ్యాట్స్‌మన్‌గా అంతర్జాతీయ టీ20ల్లో 2000కి పైగా పరుగులు సాధించిన పాండ్యా, బౌలర్‌గా కూడా 100కి పైగా వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు ఫీల్డర్‌గా కూడా తన సత్తా చాటుతూ రోహిత్ శర్మ ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టేందుకు సిద్ధమవుతున్నాడు.గత పదేళ్లలో భారత జట్టు చిన్న ఫార్మాట్‌లో అజేయ శక్తిగా ఎదిగింది. ఈ కాలంలో ఆధునిక కాలపు సూపర్‌స్టార్లను భారత క్రికెట్ ప్రపంచానికి పరిచయం చేసింది. ఆ జాబితాలో హార్దిక్ పాండ్యా పేరు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 2016లో ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో హార్దిక్ పాండ్యా భారత్ తరఫున టీ20 ఫార్మాట్‌లో అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్ నుంచి టీమిండియాలో కీలక సభ్యుడిగా మారాడు. అయితే గాయాల కారణంగా కొంతకాలం అతని ప్రదర్శనలకు బ్రేక్ పడింది. హార్దిక్ పాండ్యా ఇప్పటివరకు భారత్ తరఫున 134 అంతర్జాతీయ ం20X మ్యాచ్‌లు ఆడాడు. ఇది మూడు ఫార్మాట్లలో అతను ఆడిన అత్యధిక మ్యాచ్‌ల సంఖ్య. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లో కూడా పాండ్యా ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 2024లో టీ20 క్రికెట్‌కు రిటైర్ అయ్యాడు. తన కెరీర్‌లో 159 టీ20ఐ మ్యాచ్‌లు ఆడి మొత్తం 65 క్యాచ్‌లు పట్టుకున్నాడు. ఇది భారత ఆటగాళ్లలో అత్యధిక క్యాచ్‌ల రికార్డు. 30-యార్డ్ సర్కిల్‌లో ఫీల్డింగ్ చేస్తూ సురక్షితమైన చేతుల జోడిగా రోహిత్ పేరుపొందాడు. ముఖ్యంగా యువ దశలో భారత్‌కు అతను వేగవంతమైన ఫీల్డర్‌గా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా 64 క్యాచ్‌లతో రోహిత్ రికార్డును అధిగమించే దశకు చేరుకున్నాడు. ఈ జాబితాలోని చాలా మంది ఆటగాళ్లు భారత క్రికెట్‌కు దీర్ఘకాలంగా సేవలందించిన సీనియర్ ప్లేయర్లు. కానీ రింకు సింగ్, తిలక్ వర్మ మాత్రం 2023లోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యువకులు. ఇప్పటివరకు 45 మ్యాచ్‌లు ఆడి ఇప్పటికే ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకోవడం వారి అద్భుతమైన ఫీల్డింగ్‌కు నిదర్శనం. ముఖ్యంగా రింకు సింగ్ మైదానంలో 'బాల్ మాగ్నెట్'లా వ్యవహరిస్తూ అనూహ్యమైన క్యాచ్‌లతో అభిమానులను ఆకట్టుకుంటున్నాడు. ఎంఎస్ ధోనీ ప్రవేశపెట్టిన "ఫీల్డర్లు మ్యాచ్‌లు గెలిపిస్తారు" అనే సిద్ధాంతం తర్వాత భారత్ అత్యుత్తమ ఫీల్డింగ్ స్కిల్స్ ఉన్న ఆటగాళ్లను ఎక్కువగా ప్రోత్సహిస్తోంది. హార్దిక్ పాండ్యా 134 టీ20ఐ మ్యాచ్‌ల్లో 105 సార్లు బ్యాటింగ్ చేసి 2176 పరుగులు చేశాడు. సగటు 27.89 కాగా, స్ట్రైక్ రేట్ సుమారు 144.80గా ఉంది. అతని ఖాతాలో 8 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

సినిమా
ప్రజావీక్షణం దినపత్రిక

# చదువులో ఇద్దరూ ఇద్దరే

**విజయ్, రష్మికల డిగ్రీలపై సోషల్ మీడియా షేర్**



టాలీవుడ్ ప్రేమజంట విజయ్ దేవరకొండ- రష్మిక మంధాన ఫిబ్రవరి 26న పెళ్లి బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ లో వీరి వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ఇప్పటికే కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి ఈ జంట అక్కడికి చేరుకుంది. ఈ నేపథ్యంలో వీరిద్దరి వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా విద్యాభ్యాసానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల్లోకి రాకముందు విజయ్, రష్మిక ఇద్దరూ తమ చదువును పూర్తి చేసి తర్వాతే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. విజయ్ దేవరకొండ తొలుత హైదరాబాద్‌లోని లోకల్ స్కూల్‌లో చదివారు. ఆ తర్వాత పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హయర్ సెకండరీ స్కూల్లో హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి వరకు చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశారు. తర్వాత హైదరాబాద్‌లోని భద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో కామర్స్ డిగ్రీ చేశారు. డిగ్రీ పూర్తయ్యాకే సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించి, తరువాత 'పెళ్లిచూపులు' సినిమాతో హీరోగా గుర్తింపు పొందారు. ఇక రష్మిక మందన్న మొదట కూర్గ్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. ఆ తర్వాత గోనికొప్పలోని స్కూల్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేశారు. అనంతరం బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సైన్స్ అండ్ కామర్స్ లో సైకాలజీ, జర్నలిజం, ఇంగ్లీష్ లిటరేచర్‌లో డిగ్రీ చేశారు. కాలేజీ రోజుల నుంచే మోడలింగ్ ప్రారంభించిన రష్మిక, తరువాత కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా సక్సెస్‌తో దక్షిణాది ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఇలా విజయ్ ? రష్మిక ఇద్దరూ డిగ్రీ పూర్తిచేసి తర్వాతే సినిమాల్లోకి వచ్చారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో స్టార్ హోదాలో కొనసాగుతున్నారు. ఇప్పుడు పెళ్లి బంధంతో ఒకటవుతున్న ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి వెడ్డింగ్ ఫోటోల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చదువులోనూ మెరుపులు మెరిపించిన ఈ స్టార్ కపుల్? జీవితంలోనూ సక్సెస్

# తమిళ మూవీలో వైష్ణవి చైతన్య

తెలుగులో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన బేబి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వైష్ణవి చైతన్య . ఈ భామ ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో మరో సినిమా చేస్తూ బిజీగా ఉంది. కాగా ఈ బ్యూటీ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. వైష్ణవి చైతన్య, పాపులర్ కోలీవుడ్ కంపోజర్ కమ్ యాక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తాజా కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ ఇప్పటికే తమిళంలో అజిత్ కుమార్ నటించిన వలిమైలో కామియో రోల్‌లో మెరిసింది. ఇదే నిజమైతే వైష్ణవి చైతన్యకు తమిళంలో హీరోయిన్‌గా తొలి సినిమా ఇదే కానుంది. మొత్తానికి వైష్ణవి చైతన్య బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో బిజీగా ఉన్నట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. రానున్న రోజుల్లో వైష్ణవి చైతన్య నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.



# టాలీవుడ్‌లోకి హాలీవుడ్ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ

## అన్నపూర్ణలో ప్రారంభించిన దర్శకధీరుడు జక్కన్న

తెలుగు సినీ ఇండస్ట్రీలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కడానికి సిద్ధమైంది. ఇప్పటికే పాన్‌ఇండియా సినిమాలతో దూసుకెళ్తున్న తెలుగు సినీ పరిశ్రమలో టెక్నాలజీపరంగా సరికొత్త అడుగుపడింది. 'అవతార్' సహా ఎన్నో హాలీవుడ్ సినిమాలను మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో తీస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ తెలుగు మేకర్స్ ఈ సాంకేతికత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఎంఅండ్ఎం క్యాప్ ల్యాబ్‌ను బుధవారం ఆవిష్కరించారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రూపొందిస్తున్న 'వారణాసి'లోని కీలక సన్నివేశాలను అక్కడ తీసినట్లు తెలిపారు. అన్నపూర్ణా స్టూడియోస్, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి. గతంలో అన్నపూర్ణ స్టూడియోస్‌లోనే ఏర్పాటు చేసిన 'డాల్బీ సినిమా ప్రాసెస్' సౌకర్యాన్ని రాజమౌళి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియో కూడా ఆయన చేతుల మీదుగానే ప్రారంభమైంది. ఈ సందర్భంగా జక్కన్న మాట్లాడుతూ.. అంతర్జాతీయ సినీ నిర్మాణ సంస్థలకు భారత్ నుంచే అత్యుత్తమ సాంకేతిక నిపుణులు వెళ్తున్నారు. అయితే, ఆ అధునాతన సౌకర్యాలు మాత్రం మనకు ఉండటం లేదు. 'బాహుబలి', 'ఈగ' వంటి సినిమాలు తీస్తున్నప్పుడు మనకు గనుక మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సౌకర్య ఉంటే ఇంకా ఉత్తమంగా ఎలా చేయొచ్చా? అనుకునేవాడిని. ఇప్పుడు ఇది మనకు అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ ఫిల్మ్‌మేకర్స్ ఆలోచనాధోరణి అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియోలను నేను సందర్శించా. ఏ అండ్ ఎం అద్భుతంగా టెక్నాలజీని అందిస్తోంది. ఇప్పటికే 'వారణాసి' కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని కీలక సన్నివేశాలను తీశా. అవి అద్భుతంగా వచ్చాయని రాజమౌళి అన్నారు. భారతీయ సినీ ప్రయాణంలో ఇదొక మైలురాయి అని కథానాయకుడు నాగార్జున అభివర్ణించారు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి

## తమన్నా భాటియా వెల్లడి



**నటీనటులు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు ఉన్నప్పుడే వేరే ఆదాయ మార్గాలు చూసుకోవాలని నటి తమన్నా అన్నారు. లేదంటే తర్వాత చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమలోకి వచ్చిన తమన్నా 21 సంవత్సరాల నుంచి అగ్ర హీరోల సరసన నటిస్తూ మెప్పిస్తున్నారు. కొత్తగా నగల వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు తెలిపారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతు ఇస్తూ.. మార్గనిర్దేశర చేశారు. ఇప్పడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. అవే నాకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయనే వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో దూరదృష్టి అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు' అని తమన్నా అన్నారు. ఇక ఈ ఏడాది తమన్నా వరుస ప్రాజెక్ట్‌లతో సందడి చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సిద్దార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' మే15న విడుదల కానుంది. అలాగే అజయ్ దేవ్‌గణ్, సంజయ్‌దత్ నటిస్తోన్న 'రేంజర్'లో తమన్నా కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నట్లు సమాచారం.**

# కొత్త తిరుపతిని చూస్తారు

## : దర్శకుడు అజయ్ భూపతి



'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి వైవిధ్యభరితమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే ఈ సినిమా గురించి ఆసక్తికరమైన అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు అజయ్. ఈ సినిమా ద్వారా ప్రపంచానికి తెలిసిన ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలోని మరో కోణాన్ని, ఇప్పటివరకు ఎవరూ చూడని సరికొత్త పార్శ్వాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. మీరు ఇప్పటివరకు చూడని తిరుపతిని చూపిస్తాను.. సిద్ధంగా ఉండండి' అంటూ ఆయన చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని టాలీవుడ్‌కు హీరోగా పరిచయం అవుతుండటం విశేషం. ఆయన సరసన ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్టును వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ మరియు సి.కె. పిక్చర్స్ వంటి దిగ్గజ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తిరుపతి నేపథ్యంలో అజయ్ భూపతి శైలిలో ఎంత 'రా' అండ్ 'రస్టిక్'గా ఉండబోతుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com